
ఆయువు పోసే ఆలయం



భూమ్మీద పడింది. కళ్లు తెరవకనే గుండెకు చిల్లు. పేద అమ్మానాన్నల గుండెల్లో కలవరం. ఏం చేయాలో పాలుపోని వైనం. తిరుపతిలో ఫ్రీగా చికిత్స చేస్తారనే తీయని మాట చెవిన పడింది. క్షణం ఆలస్యం చేయకుండా చేరుకున్నారు. 48గంటల్లోనే ఆపరేషన్ పూర్తయింది. పసికందు కోలుకుంది. తల్లడిల్లిన తల్లిదండ్రుల గుండెనిండా పట్టరాని ఆనందం విరిసింది. ఇలాంటి వైనాలెన్నింటికో కేంద్రంగా నిలుస్తోంది పద్మావతి హార్ట్ సెంటర్ (హృదయాలయం).

- వివరాలు 8లో -

జలజలమంటూ..



తిరుపతిలో బుధవారం సాయంత్రం వానొచ్చింది. నగరంలోని రోడ్లపైకి నీళ్లు చేరాయి. మరో వైపు శేషాచల కొండల్లో కురిసిన వర్షంతో.. రాళ్లు రప్పలు దాటుకుంటూ జలజలమంటూ కపిలతీర్థంలోకి నీళ్లు దూకుతున్నాయి.

నేడు ఢిల్లీలో స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు ప్రదానం

తిరుపతి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగర పాలకసంస్థకు స్వచ్ఛ సర్వేక్షణ్-2024 అవార్డును గురువారం కేంద్ర ప్రభుత్వం ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో ప్రదానం చేయనుంది. కేంద్ర హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ చేతుల మీదుగా ఈ అవార్డును మేయర్ శిరీష, కమిషనర్ ఎన్.మౌర్య అందుకోనున్నారు. దీనికోసం వీరిద్దరూ బుధవారం ఢిల్లీకి బయల్దేరి వెళ్లారు.

హౌసింగ్ శాఖలో అవినీతి

- ఇంజనీరింగ్ అసిస్టెంట్‌పై క్రిమినల్ కేసుకు సిఫార్సు

వరదయ్యపాళెం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): వరదయ్యపాళెం హౌసింగ్ శాఖలో అవినీతి అక్రమాలకు పాల్పడిన ఇంజనీరింగ్ అసిస్టెంట్ కార్తీక్‌పై క్రిమినల్ కేసు నమోదుకు సిఫార్సు చేస్తూ కలెక్టర్ వెంకటేశ్వర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందిరానగర్ సచివాలయ పరిధిలో 2021-24 మధ్య గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో నిర్మించిన 53 ఇళ్లకు బిల్లుల చెల్లింపులో అక్రమాలు చోటు చేసుకున్నాయని గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త ఆశా సమాచార హక్కు చట్టం ద్వారా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపిన కలెక్టర్.. అవినీతిని నిర్ధారిస్తూ ఇంజనీరింగ్ అసిస్టెంట్ కార్తీక్‌పై క్రిమినల్ కేసు నమోదుతో పాటు రూ.13,75,891 రికవరీ చేయాలని ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఇంజనీరింగ్ అసిస్టెంట్‌పై అప్పట్లో ఒత్తిడి తెచ్చి అక్రమాలకు పాల్పడిన వైసీపీ నాయకుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. అధికారులు మరింత లోతైన విచారణ జరిపితే తమ పేర్లు ఎక్కడ బయటకు వస్తాయోనన్న ఆందోళనలో ఉన్నారు.

'పల్లం'పై పెద్దల కన్ను

● సీజేఎఫ్ఎస్ భూముల కొనుగోలు ముసుగులో ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నం

అటు పారిశ్రామికం. ఇటు విద్యాకేంద్రం. ఈ రెండు రంగాల్లో ఏర్పేడు మండలం ముందుంది. దీంతో భూముల రేట్లు పెరిగాయి. ఇక్కడే కొందరు పెద్దలు.. ప్రభుత్వ భూములపై కన్నేశారు. అలా వీరి చూపు 'పల్లం'లోని అంధనాల గుంతపై పడింది.

- ఏర్పేడు, ఆంధ్రజ్యోతి



సీజేఎఫ్ఎస్ భూముల పక్కన చదును చేసిన ప్రభుత్వ భూమి

ఏర్పేడు మండలం పల్లం రెవెన్యూ పరిధిలో గత ప్రభుత్వంలో టీటీడీ ఉద్యోగులకు ఇళ్ల స్థలాల పంపిణీ పేరిట 500 ఎకరాల్లో ఇప్పటికే ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. డీఆర్‌డీఏకు 50 ఎకరాలు కేటాయించారు. ప్రస్తుతం ఆ భూముల్లో నిర్మాణ పనులు జరుగుతున్నాయి. దీంతో పల్లం రెవెన్యూలో భూములకు గిరాకీ ఏర్పడింది. డీఆర్‌డీఏకి ఇచ్చిన 50 ఎకరాలకు ఎదురుగా ఏర్పేడు- వెంకటగిరి రహదారిని ఆనుకుని సర్వే నెంబరు 305లో 29 ఎకరాల అంధనాల గుంత ఉంది. ఈ గుంత చుట్టూ పల్లం దళితవాడకు చెందిన 75మంది రైతులకు 18 ఎకరాలను 1974లో సీజేఎఫ్ఎస్ కింద ప్రభుత్వం అందించింది. దళితుల వద్ద ఉన్న సీజేఎఫ్ఎస్ భూములను కొనుగోలు చేసి, దాని పక్కనే ఉన్న అంధనాల గుంతను కబ్జా చేయడానికి కొందరు పెద్దలు ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఈ భూమిని తమ పేర్లతో మార్చుకోవడానికి కొంతమంది, తమ ఆధీనంలోకి తెచ్చుకోవడానికి మరొకొందరు చర్యలు చేపట్టారని స్థానికులు ఆరోపిస్తున్నారు. రహదారికి ఆనుకుని ప్రభుత్వ భూముల్లో పదిరోజులుగా చెట్లను తొలగించి చదును చేస్తున్నారు. సీజేఎఫ్ఎస్ భూముల కొనుగోలు ముసుగులో భూములను చదును చేస్తుంటే రెవెన్యూశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోలేదు. కబ్జాకు ప్రయత్నం చేస్తున్న భూమి విలువ రూ.కోట్లలో ఉంది. కాగా, పల్లం రెవెన్యూలో ప్రభుత్వ భూములను అధికారులు కాపాడకపోతే, భవిష్యత్తులో స్థానిక.. ప్రభుత్వ అవసరాలకు సెంటు ప్రభుత్వ భూమి కూడా మిగలదు.

విచారించి చర్యలు తీసుకుంటాం


ఈ ప్రాంతంలో దశాబ్దాల కిందట పల్లం దళితవాడకు చెందిన కొందిరికి సీజేఎఫ్ఎస్ కింద పట్టాలు ఇచ్చినట్లు ప్రాథమికంగా గుర్తించాం. అయితే పూర్తిస్థాయిలో విచారించి ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకుంటాం.

- భార్గవి, తహసీల్దారు

19న తిరుపతికి సీఎం రాక

- కపిలతీర్థంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రకు హాజరు
- పరేడ్ మైదానంలో పీ4 మార్గదర్శులు, బంగారు కుటుంబాలతో ముఖాముఖి
- నేడు ఖరారు కానున్న పర్యటన షెడ్యూలు

తిరుపతి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 19వ తేదీన తిరుపతి రానున్నారు. ప్రతి నెలా మూడో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఏదో ఒక జిల్లాలో సీఎం పాల్గొనడం ఆనవాయితీ. అందులో భాగంగా ఈ శనివారం తిరుపతిలో పర్యటించనున్నారు. భక్తులతో కలసి కపిలేశ్వరాలయ ఆవరణను, పుష్కరిణిని శుభ్రపరచనున్నారు. అనంతరం పోలీస్ పరేడ్ మైదానానికి చేరుకుని పీ4 కార్యక్రమంలో భాగంగా మార్గదర్శులను, బంగారు కుటుంబాలను కలుసుకుంటారు. మార్గదర్శులుగా ముందుకొచ్చిన హోటల్ తాజ్, హోటల్ పాయ్ వైస్రాయ్, రాస్, రోటరీ క్లబ్, అమరరాజా సంస్థల ప్రతినిధులతో పాటు ఆ సంస్థలు దత్తత తీసుకునే బంగారు కుటుంబాల్లో ఎంపిక చేసిన పది కుటుంబాలతో సీఎం చంద్రబాబు ముఖాముఖీ సమావేశం కానున్నారు. ఈ ఈ కార్యక్రమాలతో పాటు ఒకట్రెండు అదనపు కార్యక్రమాలు కూడా సీఎం పర్యటన షెడ్యూలులో చేరనున్నట్లు సమాచారం.గురువారం అధికారికంగా పర్యటన ఖరారయ్యే అవకాశముంది. కాగా, సీఎం చంద్రబాబు తిరుపతిలో పర్యటించనున్న ప్రదేశాలను బుధవారం కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధనరాజు, సీఎం భద్రతా విభాగం అధికారులు పరిశీలించారు.



శ్రీకాళహస్తి పూర్వ పీఆర్ ఏఈపై విచారణాధికారి మార్పు

తిరుపతి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తిలో ఇదివరకూ పనిచేసిన పంచాయతీరాజ్ ఏఈ ఈశ్వర్ బాబుపై విచారణాధికారిని మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన గతంలో శ్రీకాళహస్తిలో పనిచేస్తూండిన సమయంలో మున్సిపాలిటీ పరిధిలోని రాజీవ్‌నగర్‌లో గ్రావెల్ రోడ్ల నిర్మాణ వ్యవహారంలో అక్రమాలు జరిగాయి. దీనిపై ప్రభుత్వానికి ఫిర్యాదులు అందడంతో ఈశ్వర్ బాబుపై 2013లో శాఖాపరమైన విచారణకు ఆదేశించింది. అప్పట్లో తిరుపతి మున్సిపల్ కమిషనర్‌గా ఉన్న టి.సకలారెడ్డిని విచారణాధికారిగా ప్రభుత్వం నియమించింది. ఆయన బదిలీపై వెళ్లడంతో.. ఆ స్థానంలో 2020లో తిరుపతి మున్సిపల్ డిప్యూటీ కమిషనర్‌గా పనిచేసిన చంద్రమౌళీశ్వర్‌రెడ్డిని విచారణాధికారిగా ప్రభుత్వం నియమించింది. తిరుపతి పార్లమెంటు ఉప ఎన్నికల సందర్భంగా అక్రమాలకు పాల్పడినట్టు ఆరోపణలు రావడంతో ఆయన ప్రస్తుతం సస్పెన్షన్‌లో వున్నారు. దీంతో తాజాగా తిరుపతి ప్రస్తుత డిప్యూటీ కమిషనర్ ఎన్.అమరయ్యను విచారణాధికారిగా నియమిస్తూ బుధవారం మున్సిపల్ పాలనా శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. రెండు నెలల వ్యవధిలో విచారణ ముగించి ప్రభుత్వానికి నివేదిక అందజేయాలని ఆయన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈశ్వర్ బాబుపై విచారణకు సంబంధించిన రికార్డులను వెంటనే విచారణాధికారికి అందజేయాలని మున్సిపల్ పాలనా శాఖ డైరెక్టర్‌ను ముఖ్య కార్యదర్శి ఆదేశించారు.

'కలర్స్' ట్రేడింగ్ యాప్ పేరిట రూ.ఆరు లక్షల మోసం

తిరుపతి(నేరవిభాగం), జూలై 16(ఆంధ్రజ్యోతి): 'కలర్స్ ట్రేడింగ్ యాప్‌లో పెట్టుబడి పెట్టండి. అధిక లాభాలు పొందండి' అంటూ సైబర్ నేరగాళ్లు నమ్మించి.. మోసం చేశారు. తిరుపతి ఈస్ట్ సీఐ శ్రీనివాసులు కథనం మేరకు.. కెనడీనగర్‌కు చెందిన రూపకుమార్ సెల్‌ఫోనుకు గుర్తు తెలియని వ్యక్తులు కలర్స్ ట్రేడింగ్ యాప్‌ను పంపారు. ఈ యాప్‌లో తక్కువగా పెట్టుబడి పెడితే అధిక మొత్తంలో లాభాలు వస్తాయని నమ్మబలికారు. రూ 50,000 పెట్టుబడి పెట్టి చూడు నీ అకౌంటుకు కనీసం రూ.లక్ష వరకు లాభాలు వస్తాయని చెప్పడంతో ఆయన నమ్మారు. అప్పుడప్పుడు రూ 50,000, రూ 20,000 పెట్టుబడులు పెడుతూ వచ్చారు. ఇలా దాదాపు రూ.ఆరు లక్షల వరకు కలర్స్ యాప్‌లో పెట్టుబడులు పెట్టారు. మళ్లీ పెట్టిన పెట్టుబడులకు లాభాలు అకౌంటులో జమ కాకపోవడంతో తనకు లింకు వచ్చిన వాట్సాప్ నెంబరు ద్వారా గుర్తు తెలియని వ్యక్తిని సంప్రదించారు. వారు మళ్లీ అదనంగా రూ.లక్ష పెట్టాలని చెప్పారు. తన వద్ద అంత డబ్బుల్లేవని, తాను పెట్టిన పెట్టుబడి తిరిగి ఇవ్వాలని కోరడానికి మళ్లీ ఫోను చేశారు. అయితే వారి నుంచి సమాధానం లేకపోవడంతో మోసపోయానని తెలుసుకుని 1930కి ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై తిరుపతి ఈస్ట్ సీఐ శ్రీనివాసులు కేసు నమోదు చేశారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో వాహనదారుడికి మూడురోజుల జైలు

- మరో 14 మందికి జరిమానా

తిరుపతి(నేరవిభాగం), జూలై 16(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో మద్యం తాగి వాహనం నడిపిన కేసులో ఒకరికి మూడు రోజుల జైలు శిక్షతో పాటు మరో 14 మందికి జరిమానా విధిస్తూ జిల్లా నాలుగవ అదనపు న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ బుధవారం తీర్పు చెప్పారు. ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణమాచ్చారి తెలిపిన వప్రకారం.. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిని బ్రీత్ అనలైజర్లతో ట్రాఫిక్ పోలీసులు తనిఖీ చేస్తున్నారు. మోతాదుకు మించి మద్యం తాగిన వారిపై కేసులు నమోదు చేసి న్యాయమూర్తి ముందు హాజరుపరిచారు. ఈ క్రమంలో తిరుచానూరుకు చెందిన వపన్‌కు మూడు రోజుల జైలు శిక్ష విధించారు. మరో 14 మందికి జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

కనుల పండువగా శ్రీనివాసుడి పుష్పపల్లకి





ఆణివార ఆస్థానం సందర్భంగా బుధవారం సాయంత్రం చిరుజల్లుల నడుమ పుష్పపల్లకీ సేవ కన్నుపండువగా జరిగింది. వివిధ రకాల పుష్పాలతో సర్వాంగసుందరంగా అలంకరించిన పల్లకీపై శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామిని కొలువుదీర్చి శ్రీవారి ఆలయ నాలుగు మాడవీధుల్లో ఊరేగించారు. పల్లకీలోని ఉత్సవ మూర్తులను భక్తులు దర్శించి ఆనందపరశులయ్యారు. ఆరురకాల సంప్రదాయ పుష్పాలు, మరో ఆరు రకాల స్వదేశీ, విదేశీ కట్‌ఫ్లవర్స్‌తో కలిపి మొత్తం టన్ను బరువు కలిగిన పుష్పాలను పల్లకి అలంకరణకు వినియోగించారు. వివిధ దేవతామూర్తుల ప్రతిమలను పల్లకీకి ఏర్పాటు చేశారు. పష్పపల్లకీ సేవకు ముందు వర్షం పడి నిలిచిపోయిన క్రమంలో ఆలయంపై ఏర్పడిన ఇంద్రధనస్సు భక్తులకు కనువిందు చేసింది. ఈఅందాల నడుమ పుష్పపల్లకీ ఉత్సవం శోభాయమానంగా దర్శనమిచ్చింది. భక్తులు అధిక సంఖ్యలో ఉత్సవంలో పాల్గొని ఉత్సవ మూర్తులను దర్శించుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

సుపరిపాలన చంద్రబాబుకే సాధ్యం


మోటావారికండ్రిగలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

రామచంద్రాపురం, జూలై 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సుపరిపాలన చంద్రబాబుకే సాధ్యమని మాజీ ఎంపీపీ కేశవులునాయుడు అన్నారు. మండలంలోని మోటావారి కండ్రిగలో బుధవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కేశవులునాయుడు మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం సమాంతరంగా చేయగల సమర్థత చంద్రబాబుకే ఉందన్నారు. మండలంలో ఎమ్మెల్యే నాని రూ.7కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్లాన్నారన్నారు. కార్యక్రమలో పార్టీ జిల్లా కార్యదర్శి కోరా హరిప్రసాద్, సురేంద్రనాయుడు, రాజమాణిక్యంనాయుడు, గంగాధరంనాయుడు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో యూరియా

రామచంద్రాపురం, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుప్పంబాదూరు రైతు సేవా కేంద్రం వద్ద యూరియా అందుబాటులో ఉందని వ్యవసాయాశాఖాధికారి కల్పన తెలిపారు. రాయలచెరువు కట్టపై ఉన్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వ్యవసాయ శాఖ సిబ్బంది అందుబాటులో లేనందున కట్టపై ఒక యూరియా కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. త్వరలో రాయలచెరువుకట్ట కింద మరో కేంద్రాన్ని అందుబాటులోకి తెస్తామన్నారు.

శాస్త్రోక్తంగా సూర్యనారాయణస్వామి తిరువీధి వేడుక



తిరుచానూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): తిరుచానూరులో కొలువైన సూర్యనారాయణస్వామికి బుధవారం వేడుకగా తిరువీధి ఉత్సవం జరిగింది. దక్షిణాయన పుణ్యకాలం సందర్భంగా స్వామివారి ఆలయంలో అర్చకులు విశేషాది పూజాదికార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం సర్వలంకార శోభితుడైన స్వామి బంగారు తిరుచ్చిపై కొలువుదీరి తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఎస్వో రాధాకృష్ణ మూర్తి, సూపరింటెండెంట్ రమేష్, టెంపులు ఇన్‌స్పెక్టర్లు చలపతి, సుబ్బరాయుడు, సుభాస్కర్‌నాయుడు, హరి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన ద్రౌపది స్వయంవర ఘట్టం


హరికథ భాగవతారిణి అనసూయ

రామచంద్రాపురం, జూలై 16(ఆంధ్రజ్యోతి): రామాపురంలో మహాభారత ఉత్సవాల్లో భాగంగా భాగవతారిణి అనసూయ బుధవారం ప్రదర్శించిన ద్రౌపదీ స్వయంవరం ఘట్టం అలరించింది. మారువేషంలో వచ్చిన అర్జునుడు మత్స్యయంత్రాన్ని ఛేదించి ద్రౌపదిని చేపట్టిన సంఘటనను చక్కగా వినిపించారు. అంతకు ముందు ఆలయంలో ద్రౌపదీ సమేత ధర్మరాజుల మూలమూర్తులకు మంగళవాయిద్యాల నడుమ తిరుమంజనం జరిగింది. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

ఎల్లమ్మ హుండీ ఆదాయం రూ.8.16లక్షలు



చంద్రగిరి, జూలై 16(ఆంధ్రజ్యోతి): మూలస్థాన ఎల్లమ్మ ఆలయం హుండీని బుధవారం లెక్కించారు. ఈఏడాది మార్చి 26 నుంచి ఈనెల 16 వరకు భక్తులు వేసిన కానుకలను తిరుపతి డివిజన్ తనిఖీదారు పణిరాజశయన్ ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది లెక్కించారు. రూ.8,16,473 నగదు వచ్చింది. ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్‌రెడ్డి, ఈవో మమత, చంద్రగిరి సప్తగిరి గ్రామీణ బ్యాంకు సిబ్బంది, పోలీసులు, రెవెన్యూ శాఖ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాజీయే రాజమార్గం: సివిల్ జడ్జి పూర్ణిమదేవి


సదస్సులో పాల్గొన్న పూర్ణిమాదేవి, న్యాయవాదులు

పాకాల, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రాజీయే రాజమార్గమని జూనియర్ సివిల్ జడ్జి పూర్ణిమదేవి అన్నారు. రాష్ట్ర లీగల్ సర్వీస్ అథారిటీ ఆదేశాలతో మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం మీడియేషన్ ఫర్ ది నేషన్ కార్యక్రమం నిర్వహించారు. జడ్జి పూర్ణిమదేవి అధ్యక్షతన స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. కేసులతో కోర్టుల చుట్టూ తిరుగుతూ కాలయాపన చేసి నష్టపోకుండా ఇరువర్గాలు రాజీపడి లోక్ అధాలత్‌లో కేసులు పరిష్కరించుకోవాలని సూచించారు. కళాశాల నుంచిచిత్తూరు రోడ్డు సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో న్యాయవాదులు జి.గురుస్వామినాయుడు, బీసీ రెడ్డప్పనాయుడు, మురళీనాయుడు, గౌరీశంకరరాజు, చంద్రమోహన్, ప్రిన్సిపాల్ రెడ్డిరామరాజు, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం



పాకాల, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మొగరాల జడ్పీహైస్కూల్ నుంచి ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయులను బుధవారం ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు బాలాజీ నాయుడు, జయచంద్రనాయుడు. గణపతి, బోధనేతర సిబ్బంది దేవరాజులు, రేష్మలను పాఠశాలలో ఉపాధ్యాయ బృందం, విద్యాకమిటీ వైస్ చైర్మెన్ సురేష్ బాబు సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. పాఠశాలలో విద్యాభివృద్ధికి వీరు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సుమలత, లయన్స్ క్లబ్ రీజినల్ చైర్ పర్సన్ రామయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాల అమలుపై ఇంటింటా ప్రచారం



తిరుపతి రూరల్, జూలై16(ఆంధ్రజ్యోతి):సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా వేదాంతపురం పంచాయతీలో బుధవారం టీడీపీ నాయకులు ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాల అమలుపై ప్రచారం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన ప్రజాసంక్షేమ, అభివృద్ధి పనులను వివరించారు. ఎమ్మెల్యే పులివర్తినానీ చొరవతో చేపట్టిన కార్యక్రమాల కరపత్రాలను ప్రజలకు పంచి వివరించారు. గ్రామకమిటీ అధ్యక్షుడు చెరుకుల పరంధామయ్య యాదవ్, పార్టీ ప్రధానకార్యదర్శి తోట చిరంజీవిరెడ్డి, వైస్‌ప్రెసిడెంట్ శ్యామ్‌బాబు, నాయకులు చంద్రాముదిరాజ్, పి.జయచంద్ర, కె.రవిరెడ్డి, పి.కుమారస్వామి, రఘురామరెడ్డి, సాయి, మాధవ్, డిల్లీ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ మహాసభలను జయప్రదం చేయండి


కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

తిరుచానూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఆటోనగర్‌లో ఈ నెల 18న జరగనున్న సీపీఐ తిరుపతి నగర మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా సమితి సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. తిరుచానూరులో బుధవారం నాయకులు కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో తిరుచానూరు సీపీఐ కార్యదర్శి శ్రీనివాసులు, కనకరాజు, పర్వీన్, నగేష్, వెంకటేష్, శ్రీనివాసులు, దుర్గారావు, మీరా సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రగిరి

పాఠశాలకు ఫ్యాన్ల వితరణ



చంద్రగిరి, జూలై 16(ఆంధ్రజ్యోతి): కొటాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు దాతలు ఫ్యానుల వితరణ చేశారు. స్ఫూర్తి ఫౌండేషన్ చైర్మన్ శ్రీవ్యాల్, డైరెక్టర్ మహేష్ కుమార్, పాఠశాల పూర్వ విద్యార్థి హేమశేఖర్ మూడు ఫ్యాన్లను బుధవారం అందజేశారు. దాతలనుపాఠశాల ప్రధానోపాధ్యాయుడు కేశవయ్య, ఉపాధ్యాయులు శాలువాతో సత్కరించారు.

అమ్మవారి సేవలో ఎమ్మెల్సీ ఆలపాటి

తిరుచానూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారిని బుధవారం ఎమ్మెల్సీ ఆలపాటి రాజా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. వేదపండితులు అమ్మవారి శేషవస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు.కార్యక్రమంలో సూపరింటెండెంట్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి అధునాతన తపాలా సేవలు

భాకరాపేట, జూలై 16(ఆంధ్రజ్యోతి): వినియోగదారులు ఇంటి నుంచే సేవలను పొందేలా ఈ నెల 22 నుంచి అధునాతన తపాలా సాంకేతికత 2.0 విధానం అమలు చేయనున్నట్లు సబ్ పోస్టుమాస్టర్ వినోద్ కుమార్ తెలిపారు. చిన్నగొట్టిగల్లులో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సేవల సామర్థ్యం పెంపు, చరవాణి ద్వారా ఆర్థిక, బీమా, బ్యాంకింగ్, ఇతర లావాదేవీలు నిర్వహణతోపాటు మెరుగైన ట్రాకింగ్ విధానంతో సేవలు అందిస్తామన్నారు. ఈక్రమంలో ఈ నెల 19 నుంచి 21 వరకు తపాల సేవల్ని తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. 22 నుంచి యథాప్రకారం సేవలు అందిస్తామన్నారు.

నేటి నుంచి మహాభారత ఉత్సవాలు



తిరుపతిరూరల్, జూలై16(ఆంధ్రజ్యోతి): దుర్గసముద్రంలో గురువారం నుంచి వార్షిక మహాభారత ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం ఆలయ ప్రాంగణంలో చలువపందిళ్లు, విద్యుద్దీపాలంకరణ తదితర ఏర్పాట్లు పూర్తి చేశామని గ్రామసర్పంచ్, ఆలయధర్మకర్త మిట్టపల్లి ప్రసాద్‌రెడ్డి తెలిపారు. గురువారం ధ్వజారోహణంతో మొదలై..వచ్చేనెల4వతేదీన పుష్పయాగంతో ఈఉత్సవాలు ముగుస్తాయన్నారు. తిరోజూ అన్నదానం చేస్తామన్నారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నామని వివరించారు.

టీటీడీ బర్డ్ ట్రస్టుకు రూ.10 లక్షల విరాళం


చైర్మన్‌కు విరాళాన్ని అందజేస్తున్న జగదీష్

తిరుమల, జూలై16(ఆంధ్రజ్యోతి): టీటీడీ బర్డ్ ట్రస్టుకు బుధవారం రూ.10 లక్షలు విరాళంగా అందాయి. సికింద్రాబాద్‌కు చెందిన ముప్పరాజు జగదీష్, కడూరు విజయలక్ష్మి టీటీడీ బోర్డు సభ్యుడు సదాశివరావుతో కలిసి తిరుమలలో చైర్మన్ బీఆర్ నాయుడికి రూ.10 లక్షల డీడీని అందజేశారు.

శాస్త్రోక్తంగా ఆణివార ఆస్థానం

నారాయణవనం, జూలై 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలో టీటీడీ అనుబంధ ఆలయం పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరుడి సన్నిధిలో బుధవారం సాయంత్రం ఆణివార ఆస్థానం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరచిన అర్చకులు శుద్ధి, తోమాల, అర్చన, గంట, నైవేద్యం సమర్పించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామికి స్నపన తిరు మంజనం చేపట్టారు. సాయంత్రం నిత్యకైంకర్యాల అనం తరం ఊంజల మండలంలో శేష వాహనంపై ఉభయ దేవరుల సమేత కల్యాణ వెంకన్నను కొలువు దీర్చారు. ఈ సందర్భంగా టీటీడీ తరుపున ఆలయాధికారులు పట్టువ స్త్రాలను సమర్పించారు. ఆలయ అర్చకులు దేవేరుల సమేత కల్యాణ వెంకన్నకు ఆస్థానం నిర్వహించి భక్తులు అక్షతలను, తీర్థప్రసాదాలను అందించార

ప్రజా సమస్యల పరిష్కారానికి పెద్దపీట: నాని


ఎల్లమందలో మహిళకు కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే నాని,చిత్రంలో టీడీపీ నాయకులు

ఎర్రావారిపాలెం, జూలై16(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికే తాను తొలి ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎమ్మెల్యే పులివర్తి నాని చెప్పారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా బుధవారం ఎల్లమంద పంచాయతీలో ఇంటింటికీ వెళ్లారు. ఏడాది పాలనలో చేపట్టిన అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ ప్రతిపల్లెలోని సమస్యలపై అవగాహనకు వచ్చామన్నారు. శ్మశాన వాటికల అవసరాన్ని గుర్తించామన్నారు. ఇప్పటికే తహసీల్దార్లతో ఈ విషయంపై మాట్లాడామన్నారు. ప్రభుత్వ భూమి గుర్తించే పని శరవేగంగా సాగుతోందన్నారు. పొలాలకు దార్లు, రోడ్లు అభివృద్ధి చేస్తే గ్రామాల్లో చాలా వరకు భూసమస్యలు ఉండవన్నారు. ఆయన వెంట పార్టీ అధ్యక్షుడు దేశిరెడ్డి రఘునాథ , కార్యదర్శి మహేష్ నాయుడు, నాయకులు వేణుగోపాల్ నాయుడు,సోమనాథరెడ్డి, ఉమాదేవి, సిద్ధకుమార్, డాక్టరు రమన, విజయకుమార్,నాయక్ పాల్గొన్నారు.

టీబీ వ్యాధి పట్ల అప్రమత్తత అవసరం

సెంట్రల్ టీబీ డివిజన్ డిప్యూటీ కమిషనర్


రోగులకు మందులు పంపిణీ చేస్తున్న డాక్టర్ భార్గవ్‌సింగ్

తిరుపతి రూరల్, జూలై16(ఆంధ్రజ్యోతి): టీబీ వ్యాధిపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండి తగుజాగ్రత్తలు పాటించాలని సెంట్రల్ టీబీ డివిజన్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ భార్గవ్‌సింగ్ కుష్వాహ(ఢిల్లీ) పేర్కొన్నారు. వేంకటపతినగర్ పంచాయతీల్లో బుధవారం టీబీ ముక్తభారత్ అభియాన్-ఇంటెన్సిఫైడ్ టీబీపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. రెండువారాల మించి దగ్గు, జ్వరలక్షణాలు కనిపిస్తే వైద్య పరీక్షలు చేసుకోవాలని సూచించారు. దగ్గుమాత్రమే టీబీ వ్యాధి లక్షణం కాదన్నారు. ఛాతిలో నొప్పి, ఆయాసం/శ్వాస ఆడకపోవడం, బరువు తగ్గడం వంటివి కూడా లక్షణాలని వివరించారు. మందులు పంపిణీ చేశారు. పీఎంటీబీ ఎంబీఏ ప్రతినిధి ధర్మారావు, డ్రగ్స్ కన్సల్టెంట్ గంగాధరదాస్, డబ్ల్యూహెచ్‌వో ప్రతినిధి డాక్టర్ ధీరజ్, డీఎల్‌టీవో డాక్టర్ శైలజ, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కె.ధనలక్ష్మి, అంజనబాయి, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



పంచాయతీ కార్మికులతో ఏఐటీయూసీ నాయకులు

తిరుచానూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీలోని కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. గ్రామ పంచాయతీ వర్కర్స్ జనరల్ బాడీ సమావేశం బుధవారం జరిగింది. దీనికి ఆయనతో పాటు పార్టీ సహాయ కార్యదర్శి వైఎస్ మణి, సీపీఐ కార్యదర్శి ఎమ్మార్‌పల్లి శ్రీనివాసులు హాజరయ్యారు. చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఇక్కడి కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం లేదన్నారు. అమ్మవారి దర్శనానికి నిత్యం వేలమంది వస్తాన్నారు. ఈక్రమంలో పరిసరాలను శుభ్రంగా ఉంచేందుకు కార్మికులు ఉదయం 4.30నుంచి సాయంత్రం వరకు పనిచేస్తున్నారన్నారు. వీరి సమస్యలను కలెక్టర్ వెంకటేశ్వర్, డీఎల్‌పీవోసుశీలాదేవిని కలిసి నివేదిస్తామన్నారు. ఏఐటీయూసీ నాయకులు మునికృష్ణయ్య, శ్రీనివాసులు, ప్రసన్న, విజయ్, హరిబాబు, భానుప్రకాష్, గంగయ్య, చంద్రకళ, మాతమ్మ పాల్గొన్నారు.

జర్నలిస్ట్ హెల్త్‌స్కీం గడువు పొడిగింపు

చిత్తూరు కలెక్టరేట్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్‌స్కీం 2025-26వ ఆర్థిక సంవత్సరానికి పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లావ్యాప్తంగా అక్రిడిటేషన్లు కలిగివున్న వర్కింగ్ జర్నలిస్టులందరూ పథకానికి ప్రీమియం కింద రూ.1250 డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.సీఎఫ్ఎంఎస్.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా హెడ్ అకౌంట్ 8342-00-120-01-03-001-001, డీడీవో కోడ్ 2703 0802 003 పద్దుకింద చెల్లించి లబ్ధిపొందాలన్నారు. ప్రీమియం చెల్లించిన జర్నలిస్టులు ఒరిజినల్ చలానా, రెన్యూవల్ చేసుకున్న అక్రిడిటేషన్ జిరాక్స్ కాపీలను కలెక్టరేట్‌లోని జిల్లా సమాచార పౌరసంబంధాల కార్యాలయంలో అందించాలన్నారు. హెల్త్‌స్కీమ్ ప్రీమియం రూ.2500 కాగా, ఇందులో జర్నలిస్టు వాటా రూ.1250, ప్రభుత్వ వాటా రూ.1250 అన్నారు. జర్నలిస్టు భార్య, భర్త, పిల్లలు, వారిపై ఆధారపడ్డ తల్లిదండ్రులకు ఈ స్కీమ్ వర్తిస్తుందన్నారు. జర్నలిస్టుల వైద్యఖర్చులను డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టు విధివిధానాలను అనుసరించి చెల్లిస్తుందన్నారు. జర్నలిస్టులకు లేదా వారిపై ఆధారపడ్డ కుటుంబసభ్యులకు ఏదైనా అనారోగ్యం సంభవిస్తే హెల్త్‌స్కీమ్ ద్వారా రూ.2 లక్షల వరకు విలువచేసే వైద్యసేవలు అందుతాయన్నారు. ఇలా సంవత్సర కాలంలో ఎన్నిసార్లయినా పరిమితి లేకుండా ఈ సదుపాయాన్ని పొందవచ్చని చెప్పారు. వర్కింగ్ జర్నలిస్టు హెల్త్ స్కీమ్ ద్వారా జర్నలిస్టులకు ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ (ఈహెచ్‌ఎస్) తరహాలో నగదురహితంగా వైద్యసేవలను ప్రభుత్వం అందిస్తున్నదన్నారు. దీనిపై ఎలాంటి ఆదాయ పరిమితులు లేవని, నిర్దేశిత చికిత్సలకు సంబంధించి ఉచిత ఔట్‌పేషంట్ సేవలు కూడా పొందవచ్చని ఆయన సూచించారు. అక్రిడిటేషన్ కల్గిన జర్నలిస్టులందరూ ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు.

చర్లపల్లి-తిరుపతి మధ్య ప్రత్యేక రైళ్లు

తిరుపతి(సెంట్రల్) జూలై16(ఆంధ్రజ్యోతి) : ప్రయాణికుల రద్దీని తగ్గించడానికి చర్లపల్లి-తిరుపతి మధ్య ఈ ఏడాది ఆగస్టు 31 నుంచి వచ్చే ఏడాది మార్చి 30వ తేదీ వరకు ప్రత్యేక రైళ్లను రెండు మార్గాల్లో నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఎ.శ్రీధర్ తెలిపారు. ● చర్లపల్లిలో ప్రత్యేక రైలు(07017) ప్రతి ఆదివారమూ బయలుదేరి మల్కాజ్‌గిరి, కాచిగూడ, ఉందానగర్, షాద్‌నగర్, జెడ్చర్ల, మహబూబ్‌నగర్, వనపర్తిరోడ్డు, కర్నూలు సిటీ, డోన్, గుత్తి, తాడిపత్రి, ఎర్రగుంట్ల, కడప, ఒంటిమిట్ట, రాజంపేట, కోడూరు, రేణిగుంట స్టేషన్ల మీదుగా మరుసటి రోజు ఉదయం తిరుపతికి చేరుకుంటుంది. ● తిరుపతిలో ప్రత్యేక రైలు(07018) సెప్టెంబరు 1వ తేదీ నుంచి ప్రతి సోమవారమూ వచ్చిన మార్గంలోనే ప్రయాణిస్తూ మరుసటి రోజు చర్లపల్లికి చేరుకుంటుంది. ఈ రైలు మార్చి 30వ తేదీ వరకు రాకపోకలు సాగిస్తుంది.● చర్లపల్లిలో మరో ప్రత్యేక రైలు(07251) సెప్టెంబరు 3వ తేదీ నుంచి ప్రతి బుధవారమూ బయలుదేరి జనగాం, ఖాజీపేట, వరంగల్, నెక్కొండ, మహబూబాబాద్, ఖమ్మం, విజయవాడ, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, వెంకటగిరి, శ్రీకాళహస్తి, రేణిగుంట రైల్వేస్టేషన్ల మీదుగా మరుసటి రోజు తిరుపతికి చేరుకుంటుంది.● తిరుపతిలో ప్రత్యేక రైలు(07252) సెప్టెంబరు 4వ తేది నుంచి ప్రతి గురువారమూ బయలుదేరి వచ్చిన మార్గంలో ప్రయాణిస్తూ శుక్రవారం ఉదయం చేరుకుంటుంది. ఈ రైలు వచ్చే ఏడాది మార్చి 26 వరకు రాకపోకలు సాగిస్తుంది. ఈ రైళ్లలో 2ఏసీ, 3ఏసీ, సెకండ్ స్లీపర్ కోచ్లతో పాటు సాధారణ కోచ్‌లు కూడా ఉంటాయి

రేపు నగరిలో జాబ్‌మేళా

చిత్తూరు అర్బన్, జూలై 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్, సీడీప్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 18న నగరిలోని శ్రీసూర్య డిగ్రీ, జూనియర్ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గుణశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ జాబ్‌మేళాలో 19 ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయని, టెన్త్, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, బీఫార్మసీ అర్హత కలిగిన అభ్యర్థులు అర్హులన్నారు. అభ్యర్థుల వయస్సు 18 నుంచి 35 సంవత్సరాల్లోపు ఉండాలన్నారు. జాబ్‌మేళాలో ఎంపికైన వారికి రూ.12 నుంచి రూ.22వేల వరకు వేతనాలు అందే అవకాశాలు ఉన్నాయన్నారు.

నిరుద్యోగ అభ్యరులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 63008 54441ను సంప్రదించాలని కోరారు.

20న అరుణగిరిలో ఆడికృత్తిక ఉత్సవాలు

భాకరాపేట, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఎగువూరు గ్రామం అరుణగిరి(అనుముల బండ)పై వెలసిన వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ఈనెల 20న ఆడికృత్తిక ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఆ రోజు ఉదయం అభిషేకం, అర్చనలు, కల్యాణోత్సవం నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్త గుమ్మడి కృష్ణమూర్తి తెలిపారు. తదుపరి కావిళ్లు, చెల్లింపులు ఉంటాయన్నారు.

అమరాలో పోలీసులకు వార్షిక వైద్య పరీక్షలు

రేణిగుంట, జూలై 16(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా వ్యాప్తంగా 2518 మంది పోలీసులకు వైద్య పరీక్షలు నిర్వహిం చామని ఎస్పీ హర్షవర్ధన్ రాజు తెలిపారు. బుధవారం అమరరాజా గ్రూప్స్ అమరా హాస్పిటల్, కాంటినెంటల్ కాఫీ ఆధ్వర్యంలో కరకంబాడి అమర రాజా పరిశ్రమలోని ఆడిటోరియంలో వైద్య శిబిరం జరిగింది. శిబిరంలో ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి సరైన వైద్యం చేయించుకు నేందుకు అవకాశం కల్గిందని ఎస్పీ అన్నారు. ఇందుకు సహకరించిన అమరా హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రమాదేవికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు ఎస్పీ పేర్కొన్నారు.

23న జాబ్‌మేళా

కేవీబీపురం/పిచ్చాటూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ఆదిమూలం కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 23 తేదీ బుధవారం ఉదయం 8 గంటల నుంచి పిచ్చాటూరు ఎంకేటీ మహల్‌లో జాబ్‌మేళా జరగనుందని ఆయన తెలిపారు. ఈ క్రమంలో బుధవారం పెరిందేశంలో జాబ్‌మేళా పోస్టర్లను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈఎంసీ క్లస్టర్, శ్రీసిటీ, తిరుపతి, చెన్నైకి చెందిన 15 బహుళ జాతీయ కంపెనీల్లో 500పైగా ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, పీజీలో ఉత్తీర్ణులు అర్హులన్నారు. ఎన్ఏఐపీయూ ఎన్‌వైఎం. ఏపీ.జీవోవీ.ఇన్/యూఎస్ఈఆర్‌లో ఆధార్ ఓటీపీతో రిజిస్ట్రేషన్ చేసుకుని, ప్రొఫైల్‌తో లాగిన్ అయి అన్ని కంపెనీలకు దరఖాస్తు చేసుకుని అడ్మిట్ కార్డుతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు. వివరాలకు నెం. 9440374535, 9908243736, 9988853335 లలో సంప్రదించాలన్నారు.

విజ్ఞానగిరి ఆడికృత్తిక ఉత్సవాలకు ధ్వజారోహణం


ధ్వజారోహణ పూజలు

శ్రీకాళహస్తి, జూలై 16(ఆంధ్రజ్యోతి): శ్రీకాళ హస్తీశ్వరాలయంలోని చెంగల్వరాయ సన్నిధి వద్ద బుధవారం శాస్త్రోక్తంగా ధ్వజారోహణ పూ జలు నిర్వహించారు. విజ్ఞానగిరిపై ఆడికృత్తిక ఉత్సవాలను పురస్కరించుకుని ఈ పూజలు చే శారు. మొదట కలశస్థాపన, అభిషేక, హో మాలను నిర్వహించారు. అనంతరం అరటి ఆకు లో ధ్వజస్తంభాన్ని తీర్చిదిద్ది ధ్వజారోహ ణాన్ని వేదోక్తంగా నిర్వహించారు. అనంతరం వళ్లీ, దేవసేన సమేత కుమారస్వామిని పట్టణంలో ఊరేగించారు.ఈ కార్యక్రమంలో ఈవో బాపిరెడ్డి, వేదపండితులు, అర్చకులు ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అంబారీపై స్వామి పురవిహారం

ఆడికృత్తిక ఉత్సవాల్లో భాగంగా శ్రీకాళహస్తీశ్వరాలయంలోని చెంగల్వరాయస్వామి వద్ద బుధవారం రాత్రి మేళతాళాలు, మంగళవాయి ద్యాల నడుమ చెంగల్వరాయస్వామిని అంబారీ వాహనంపై అధిష్ఠించి పట్టణంలో ఊరేగించారు. భక్తులు స్వామివారికి కర్పూర హారతులు సమర్పించారు.

శ్రీరంగం నుంచి స్వామికి పట్టువస్త్రాల సమర్పణ

తిరుమల, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఆణివార ఆస్థానం సందర్భంగా బుధవారం తమిళనాడులోని శ్రీరంగం శ్రీరంగనాథస్వామి ఆలయం నుంచి శ్రీవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. పెద్దజీయర్ మఠంలో శ్రీవారిసారెకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి జీయర్‌స్వాములు, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, తమిళనాడు దేవదాయ శాఖ కార్యదర్శి శ్రీధరన్ పట్టువస్త్రాలను నాలుగుమాడవీధుల ప్రదక్షిణగా ఆలయంలోకి తీసుకెళ్లి స్వామికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ అదనపు కార్యదర్శి మణివాసగం, శ్రీరంగం ఆలయ జాయింట్ కమిషనర్ శివరామ్ కుమార్, ఆలయ ప్రధాన అర్చకుడు సుందరభట్టర్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీరంగం శ్రీరంగనాథస్వామి ఆలయం నుంచి శ్రీవారికి పట్టువస్త్రాల సమర్పణ, పుష్పపల్లకీ సేవ కార్యక్రమాల్లో పాల్గొన్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, టీటీడీ ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్యచౌదరి, అధికారులు,తదితరులు

బీసీ సంక్షేమ సంఘం నగర అధ్యక్షుడిగా శేషాద్రి


మాట్లాడుతున్న నాగరాజ్ గౌడ్

తిరుపతి (ఎంఆర్‌పల్లె), జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం తిరుపతి నగర అధ్యక్షుడిగా శేషాద్రి మొదలియార్‌ను నియమిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కల్లూరి నాగరాజుగౌడ్ తెలిపారు. ఈ మేరకు తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయనకు నియామకపత్రం అందజేశారు. శేషాద్రి మొదలియార్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవి అప్పజెప్పడం సంతోషంగా ఉందన్నారు. బీసీ సంక్షేమానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు ఆవులపాటి బుజ్జిబాబు, మునస్వామి పాల్గొన్నారు.

మినిస్టర్ వైట్ స్టోర్ ప్రారంభం

తిరుపతి అర్బన్, జూలై 16(ఆంధ్రజ్యోతి): చెన్నైకి చెందిన ప్రముఖ ఇండియన్ బ్రాండ్ మినిస్టర్ వైట్ 48వ స్టోర్‌ను గాంధీ రోడ్డులో బుధవారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రారంభించారు. అలాగే ఎయిర్ బైపాస్ రోడ్డులో ఒట్టో మెన్స్‌వేర్ స్టోర్‌ను సాయంత్రం ప్రారంభించారు. కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, సంస్థ ప్రతినిధులు సురేష్‌సుబ్రహ్మణ్యం, శివశంకరన్ పాల్గొన్నారు.

కడప పెద్దదర్గా గురువును అవమానించిన షకీషఫీపై కేసు నమోదు

తిరుపతి(నేరవిభాగం), జూలై 16(ఆంధ్రజ్యోతి): కడప పెద్దదర్గా గురువు ఆరీఫుల్లాను దూషించి అవమానపరచిన అనంతపురం రాంనగర్‌కు చెందిన షకీషఫీపై బుధవారం తిరుపతి ఈస్ట్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ శ్రీనివాసులు వివరాల మేరకు.. కొన్ని రోజుల క్రితం ఆరీఫుల్లాను ఒక ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధిగా ఉన్న షకీషఫీ దుర్భాషలాడి అవమానపరిచాడు. దీనిపై ఆరీఫుల్లా శిష్యుడు తిరుపతికిచెందిన షేక్‌చాంద్‌బాషా కోర్టుకు వెళ్లాడు. కోర్టు ఆదేశాల మేరకు ఈస్ట్ పోలీసులు షకీషఫీపై కేసు నమోదు చేశారు.

సీపీఐ ఎప్పుడూ ప్రజల పక్షమే


కరపత్రాలు పంపిణీ చేస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి

తిరుపతి(ఆటోనగర్), జూలై16(ఆంధ్రజ్యోతి): ప్రజల పక్షాన నిలబడి వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేసిన ఏకైక పార్టీ సీపీఐ అని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పి.మురళి అన్నారు. తిరుపతిలో నిర్వహించనున్న పార్టీ మహాసభలను విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. తిరుపతి అభివృద్ధిలో సీపీఐ పాత్రను ఆయన బుధవారం ప్రచారం చేశారు. ఆటో కార్మికుల కోసం చేసిన పోరాటాలను వివరించారు. నాయకులు రాధాకృష్ణ, అల్లాబక్ష్, ఆటో కార్మిక సంఘం నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

'పథకాలు కావాలంటే మళ్లీ జగన్ రావాలి'


పథకాలపై ఆరా తీస్తున్న అభినయ్

తిరుపతి(జీవకోన), జూలై 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలు సంపూర్ణంగా ప్రజలకు చేరువ కావాలంటే మళ్లీ సీఎంగా జగన్ రావాలని వైసీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి అన్నారు. బుధవారం నగర పరిధిలోని పలు డివిజన్లలో చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుకు తెస్తూ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి పథకాలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి, మురళి, ఇమ్రాన్‌బాషా, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీసీ పుస్తకానికి చెదలు

● కనిపించని విద్యార్థుల ఐదేళ్ల వివరాలు


చారాల హైస్కూల్‌లో చెదలు పట్టిన టీసీ పుస్తకం

చౌడేపల్లె, జూలై 16 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా చౌడేపల్లె మండలం చారాల హైస్కూల్‌లో టీసీ పుస్తకాలకు చెదలు పట్టాయి. బుధవారం రికార్డుల కోసం స్కూల్ సిబ్బంది బీరువాను తెరిచారు. అయితే చెదలు పట్టడంతో లోపలున్న 5 సంవత్సరాల సర్టిఫికెట్ల పుస్తకాలు దెబ్బతిన్నాయి. విద్యార్థుల వివరాలు సగానికి పైగా మాయమయ్యాయి.


లక్ష్మీపురం కూడలిలో నీటి ప్రవాహం


కరకంబాడి రోడ్డులో..


చేపల మార్కెట్ వద్ద కరెంటు స్తంభాలపై వెళుతున్న విద్యార్థులు


చేపల మార్కెట్ వద్ద..


పిల్లలను ఇంటికి తీసుకెళుతూ..


లక్ష్మీపురం కూడలిలో..

నగరంలో జోరువాన

నదులను తలపించిన రోడ్లు

వాహనదారులు, పాదచారులకు తప్పని ఇక్కట్లు

తిరుపతి అర్బన్, జూలై 16(ఆంధ్రజ్యోతి): చాలా రోజుల తర్వాత నగరంలో బుధవారం జోరువాన కురిసింది. పగలంతా ఎండ తీవ్రత కొనసాగింది. సాయంత్రం 4 గంటల తర్వాత ఆకాశంలో మబ్బులు కమ్ముకుని పెద్ద పెద్ద చినుకులతో వర్షం ప్రారంభమైంది. దాదాపు రెండు గంటల పాటు ఆగి ఆగి కురిసింది. రోడ్లన్నీ పూర్తిగా జలమయమై నీటి ప్రవాహం నదులను తలపించింది. మురుగు కాలువలు జోరుగా ప్రవహించాయి. అక్కడక్కడా అండర్ డ్రైనేజీ పొంగి పొర్లింది. బడి పిల్లలు, ఉద్యోగులు తడుస్తూనే ఇళ్లకు చేరుకున్నారు. కొందరు వాహనదారులు గరుడవారధి కింద తలదాచుకున్నారు. కొందరైతే హాయిగా ఉందంటూ తడుస్తూనే ప్రయాణం సాగించారు. చాలా రోజుల తర్వాత కపిలతీర్థం నుంచి జలపాతం జాలువారింది. గరుడ వారధిపై నుంచి వర్షపునీరు జోరుగా కిందికి దూకింది. సెంట్రల్ బస్టాండు, కూరగాయల మార్కెట్ జలమయమయ్యాయి. అండర్ బ్రిడ్జిలలో నీటి నిల్వతో కాసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వీధి వ్యాపారులకు ఇక్కట్లు తప్పలేదు. కాగా, కొన్ని నెలలుగా ఉష్ణతాపానికి అల్లాడిపోతున్న ప్రజలకు ఈ వర్షంతో ఉపశమనం లభించింది. సాయం సంధ్యవేళ ఆహ్లాదకర వాతావరణం నెలకొనడంతో నగర ప్రజలు హమ్మయ్య అని ఊపిరి పీల్చుకున్నారు. ఏడుకొండలపై మేఘామాల దృశ్యాలు ప్రకృతి ప్రేమికులకు కనువిందు చేసింది.


లక్ష్మీపురం కూడలి నుంచి బైరాగిపట్టెడ రోడ్డుపై పారుతున్న వర్షపు నీరు



వర్షపు నీటిలో విద్యార్థినులు, వ్యాపారుల అగచాట్లు



కోదండ రామస్వామి ఆలయంలో ఆస్థానం నిర్వహిస్తున్న అర్చకులు, పట్టువస్త్రాలు తీసుకొస్తున్న జీయర్ స్వాములు

వైభవంగా ఆణివార ఆస్థానం

తిరుపతి అర్బన్, జూలై 16(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని గోవిందరాజస్వామి, కోదండరామస్వామి, లక్ష్మీనరసింహస్వామి ఆలయాల్లో బుధవారం సాయంత్రం ఆణివార ఆస్థానం వైభవంగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వామి ఉత్సవర్లను ఆలయంలోని బంగారువాకిలి వద్దకు వేంచేపు చేసి ఆస్థానం కావించారు. ఈ సందర్భంగా పుండరీకవల్లి అమ్మవారి ఆలయం నుంచి నూతన వస్త్రాలను విమాన ప్రదక్షిణగా మూలవర్లకు సమర్పించారు. అలాగే సీతాలక్ష్మణ సమేత కోదండరామస్వామి ఉత్సవర్లను ఆలయంలోని గరుడాళ్వార్‌కు అభిముఖంగా వేంచేపు చేసి ప్రత్యేకంగా ఆస్థానం నిర్వహించారు. అనంతరం ఉత్సవర్లను మాడవీధుల్లో ఊరేగించారు. అలిపిరి పాదాల మండపంలోని లక్ష్మీనారాయణస్వామి ఆలయంలోనూ శాస్త్రోక్తంగా ఆస్థానం జరిపించారు. ఈ ఉత్సవాలలో టీటీడీ జియ్యంగారు, అధికారులు పాల్గొన్నారు.

డిగ్రీలో మూడు సబ్జెక్టుల విధానం తీసుకురావాలి

తిరుపతి(విద్య), జూలై 16(ఆంధ్రజ్యోతి): డిగ్రీ విద్యలో మళ్లీ మూడు సబ్జెక్టుల విధానం తీసుకురావాలని ఆలిండియా సేవ్ ఎడ్యుకేషన్ కమిటీ (ఏఐఎస్ఈసీ) రాష్ట్ర అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ఎం.సుబ్రహ్మణ్యం కోరారు. కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన 2020 విద్యావిధానం వినాశకరమైందిగా ఉందని పేర్కొన్నారు. ఈ విధానం వల్ల డిగ్రీ విద్యావ్యవస్థ కుప్పకూలే పరిస్థితులు ఏర్పడ్డాయని తెలిపారు. మూడు సబ్జెక్టులు ఎంపిక చేసుకునే విధానానికి వ్యతిరేకంగా సింగిల్ మేజర్ విధానాన్ని తీసుకురావడం వల్ల విద్యార్థులకు ఆయా అంశాలపై సమగ్రమైన జ్ఞానం అందడంలేదని వివరించారు. దీంతో అనేక కళాశాలల్లో ప్రవేశాలు తగ్గిపోయాయని పేర్కొన్నారు. దీనికితోడు అధ్యాపకులను ఇష్టారీతిన బదిలీ చేయడం వల్ల విద్యా ప్రమాణాలు మరింతగా పడిపోయే ప్రమాదముందని తెలిపారు. ఇంటర్ ఫలితాలు విడుదలై మూడు నెలలు గడుస్తున్నా ఇంతవరకు డిగ్రీ కళాశాలలకు ప్రవేశాలు జరగకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. డిగ్రీ ప్రవేశాలను ఆఫ్‌లైన్ పద్ధతిలో చేపట్టడానికి చర్యలు చేపట్టాలని ప్రకటనలో డిమాండ్ చేశారు.

'రాచపూటి రమేష్ సాహిత్యం' పుస్తకావిష్కరణ


పుస్తకావిష్కరణ చేస్తున్న వీసీ అప్పారావు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 16 (ఆంధ్రజ్యోతి): రాచపూటి రమేష్ సాహిత్యంపై సింగమాల చంద్రయ్య రూపొందించిన పుస్తకాన్ని ఎస్వీయూ వీసీ అప్పారావు ఆవిష్కరించారు. ఎస్వీయూ ఓఆర్ఐ విభాగంలో ప్రొఫెసర్ వీసీ వేంకటేశ్వర్లు పర్యవేక్షణలో పీహెచ్‌డీ క్రమంలో చంద్రయ్య ఈ పుస్తకాన్ని రాశారు. ఈ పుస్తకాన్ని తన ఛాంబర్‌లో వీసీ అప్పారావు ఆవిష్కరించిన అనంతరం మాట్లాడుతూ పోలీసు శాఖ నిఘా విభాగంలో ఉద్యోగం చేస్తూ పరిశోధన చేయడం విశేషమన్నారు. వృత్తి పనులు చేసే వారి జీవన స్థితిని వర్ణిస్తూ ఎంతో గొప్ప సాహిత్యం వచ్చిందన్నారు. చేనేత జౌళి శాఖలో ఉద్యోగిగా ఉన్న రాచపూటి రమేష్ తన అనుభవాలను రచనలుగా రూపొందించారని తెలిపారు. ఇలాంటి పుస్తకాలు మరిన్ని రాయాలని కోరారు. కాగా, తిరుపతి ప్రాంతీయ నిఘా విభాగ కార్యాలయంలో బుధవారం అడిషనల్ ఎస్పీ వెంకటరాముడు, డీఎస్పీ కంజక్షన్, ఇన్‌స్పెక్టర్ చంద్ర, సిబ్బంది వెంకటేశ్వరరావు, బాలాజీవర్మ ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఓఆర్ఐ డైరెక్టర్ ప్రొఫెసర్ వీసీ వేంకటేశ్వర్లు, పుస్తక రచయిత చంద్రయ్య, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనదారులపై కేసు

రూ.50వేల జరిమానా వసూలు


విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీటీవో మురళీమోహన్, ఎంవీఐలు శ్రీనివాసరావు, అతికానాజ్

తిరుపతి(జీవకోన), జూలై 16(ఆంధ్రజ్యోతి): కరకంబాడీ రోడ్డులో జిల్లా రవాణా శాఖ అధికారులు బుధవారం వాహన తనిఖీలు చేపట్టారు. హెల్మెట్ ధరించకపోవడం, ట్రిపుల్ రైడింగ్, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం, లైసెన్స్ లేకపోవడం తదితర కారణాలతో 40 ద్విచక్ర వాహనదారులపై కేసులు నమోదు చేశారు. రూ.50వేలు జరిమానా వసూలు చేశారు. పట్టుబడిన వారిలో ఎక్కువ మంది ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులు ఉండడం గమనార్హం. జిల్లా రవాణాశాఖాధికారి కొర్రపాటి మురళీమోహన్ మాట్లాడుతూ భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా హెల్మెట్ ధరించాలని, రహదారి పరిస్థితులకు అనుగుణంగా వేగ నియంత్రణ చేసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ తనిఖీల్లో ఎంవీఐలు శ్రీనివారావు, అతికానాజ్ పాల్గొన్నారు.



డ్రగ్స్‌తో యువత భవిష్యత్తు నాశనం

ఈగల్ టీం సీఐ ప్రసాద్


విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఈగల్ టీం సీఐ ప్రసాద్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 16 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ వినియోగంతో యువత భవిష్యత్తు పూర్తిగా నాశనం అవుతుందని ఈగల్ టీం సీఐ ప్రసాద్ పేర్కొన్నారు. ఎస్వీ యూనివర్సిటీ స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్ విభాగం ఆధ్వర్యంలో డ్రగ్స్ నివారణపై గేట్ డిగ్రీ కాలేజీలో బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. డ్రగ్స్ వాడకంతో యువత శారీరకంగా, మానసికంగా ఇబ్బంది పడుతోందన్నారు. చదువు, కెరీర్, కుటుంబం, సమాజం పట్ల బాధ్యత లేకుండా ప్రవర్తించే ప్రమాదం ఉంటుందన్నారు. డ్రగ్స్ నివారణకు యువత తోడ్పాటు అందించాలని కోరారు. ఎస్వీ యూనివర్సిటీ కల్చరల్ అఫైర్స్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్ చౌదరి మాట్లాడుతూ.. యువత భాగస్వామ్యంతో డ్రగ్స్‌ను పూర్తిగా నిర్మూలించడం సాధ్యమవుతుందన్నారు. గేట్ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ రమేష్, హెడ్ కానిస్టేబుళ్లు గిరిబాబు, కమల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


రీల్స్ ముసుగులో మహిళల ఫొటోలు తీస్తూ..

● ఆకతాయిల చేష్టలు

తిరుపతి(నేరవిభాగం), జూలై 16(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో కొందరు ఆకతాయిలు రీల్స్ ముసుగులో.. మహిళా వాకర్లు, విద్యార్థినుల ఫొటోలు తీస్తున్నారు. ఇలాంటి ఘటన సోమవారం సాయంత్రం శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ ఎదురుగా ఉన్న 100 అడుగుల రోడ్డులో చోటుచేసుకుంది. పద్మావతి నగర్‌లోని తల్లీ కూతుళ్లు ఈ రోడ్డుపై వాకింగ్ చేస్తున్నారు. ఆ సమయంలో ఇద్దరు యువకులు మద్యం తాగి వారిని బైకుపై వెంబడించారు. రీల్స్ చేస్తున్నట్లు నటిస్తూ.. ఆ తల్లీ కూతుళ్లను వెనుక వైపు.. ముందు వైపు ఫొటోలు తీశారు. దీన్ని గమనించిన బాధితులు వెంటనే వారిని పట్టుకున్నారు. అల్లరి మూకలు ఫోన్‌లోని గ్యాలరీ చూడగా, అందులో వారి ఫొటోలు ఉన్నాయి. వారిని మందలించి, ఫొటోలు తీసివేయించారు. దీంతో అల్లరి మూకలు వారిపై బెదిరింపులకు దిగారు. ఈ ప్రాంతంలో రోజూ ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని బాధితులు కొందరు చెప్పారు. ఈ ప్రాంతంలో పోలీసులు వాహనాలను తనిఖీ చేయడం, అనుమానంగా తిరుగుతున్న వారిని విచారిస్తున్నా, వారి కళ్లు కప్పి రీల్స్ పేరుతో మహిళలు, విద్యార్థినుల ఫొటోలు తీసి మార్ఫింగ్ చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

తక్షణం చర్యలు తీసుకుంటున్నాం

ఈ ఘటనను తిరుపతి డీఎస్పీ భక్తవత్సలం దృష్టికి తీసుకెళ్లగా, అక్కడకు డ్రోన్లు పంపి ఆకతాయిలను గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం బ్లూకోల్ట్స్, రక్షక్ మొబైల్ ద్వారా నిఘా ఉంచుతామని తెలిపారు.






విశ్వజిత్ రాణే - ప్రణీత

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, జూలై16(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. గోవా మంత్రి విశ్వజిత్ రాణే, సినీ హీరోయిన్ ప్రణీత ఉన్నారు.

ఆధునికీకరించిన ల్యాబ్‌ను పరిశీలించిన ఈవో

తిరుమల, జూలై16(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని పలు ప్రాంతాల్లో టీటీడీ ఈవో శ్యామలరావు బుధవారం తనిఖీలు నిర్వహించారు. ఫుడ్ అండ్ వాటర్ ల్యాబ్‌లో ఆధునీకరించిన యంత్రాలను పరిశీలంచారు. నెయ్యిని వంద శాతం పరిశీలించేందుకు వీలుగా ఇటీవల ఏర్పాటు చేసిన గ్యాస్ క్రోమటోగ్రాఫీ(జీసీ), హై పెర్ఫార్మన్స్ లిక్విడ్ కోమటోగ్రాఫీ(హెచ్‌పీఎల్‌సీ) యంత్రాల పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే ఏఎన్సీ, హెచ్‌వీసీ ఉప విచారణ కార్యాలయాల వద్ద జరుగుతున్న ఆధునీకరణ పనులను పరిశీలించి సూచనలు చేశారు. అంతకుముందు తిరుమలలోని అన్నమయ్య భవనానికి సమీపంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న శ్రీవాణి టికెట్ల జారీ కేంద్రాన్ని పరిశీలించారు. అదనపు ఈవో వెంకయ్య చౌదరి, ఈఈ సుబ్రహ్మణ్యం, డిప్యూటీఈవోలు వెంకటయ్య, భాస్కర్, సోమన్నారాయణ, డీఈ చంద్రశేఖర్, హెల్త్‌ఆఫీసర్ మధుసూదన్ ఇతర అధికారులు ఈవో వెంట ఉన్నారు.



ఫుడ్ వాటర్ ల్యాబ్‌లో పరీక్షల గురించి సిబ్బందితో మాట్లాడుతున్న ఈవో తదితరులు

సర్వ దర్శనానికి 15 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని తొమ్మిది షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.4.19 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 73,020

తలనీలాలు సమర్పించినవారు: 27,609



ఆయువు పోసే ఆలయం

హృద్రోగ బాధిత చిన్నారులకు అక్కడ ఊపిరిపోస్తారు. గుండె కవాటాలను సరిచేసి ప్రాణం నిలబెడతారు. ఆరోగ్య జీవితాన్ని ప్రసాదించి ఆయువునిస్తారు. ఒక్కమాటలో చెప్పాలంటే గుండె సంబంధిత వ్యాధిగ్రస్థులకు అది ఆలయమే. పేదలకు అమూల్య సేవలందిస్తున్న పద్మావతి చిల్డ్రన్స్ హార్ట్ సెంటర్ అనతికాలంలోనే హృదయాలయమనే పేరును సార్థకం చేసుకుంది. టీటీడీ ఆధ్వర్యంలోని బర్డ్ ఆస్పత్రి ప్రాంగణంలో ఈ సెంటర్ 2021లో ప్రారంభమై తన సేవలతో రోగుల హృదయంలో స్థానం సంపాదించుకుంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

- 4 వేల మంది చిన్నారులకు హృద్రోగ శస్త్రచికిత్సలు
- 20 మందికి విజయవంతంగా గుండె మార్పిడి
- రోగులను గుండెకు హత్తుకుంటున్న పద్మావతి చిల్డ్రన్స్ హార్ట్ సెంటర్



చికిత్స పొందుతున్న చిన్నపిల్లల వార్డు



పద్మావతి చిల్డ్రన్స్ హార్ట్ సెంటర్

నవజాత శిశువుల నుంచి వృద్ధుల వరకు పద్మావతి చిల్డ్రన్స్ హార్ట్ సెంటర్ గుండెకు హత్తుకుని ఆలంబనగా నిలుస్తోంది. మూడున్నరేళ్ల వ్యవధిలోనే గుండెకు సంబంధించి ఎన్నో సంక్లిష్టమైన శస్త్ర చికిత్సలు చేసి ఓ ప్రత్యేక స్థానాన్ని సొంతం చేసుకుంది. రాష్ట్రంలో గుండె మార్పిడి చేసే ఏకైక ఆస్పత్రిగా గుర్తింపు సాధించింది. ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి సారథ్యంలో 14 మంది వైద్యనిపుణులు నిరంతరం ఇక్కడ సేవలందిస్తున్నారు. తక్కువ కాలంలోనే 20మందికి గుండె మార్పిడి శస్త్ర చికిత్స చేశారంటే విస్తుపోవాల్సిందే. ప్రమాదవశాత్తూ చనిపోయినవారి గుండెను గ్రీన్ ఛానల్ ద్వారా వాయువేగంతో తెచ్చి మృత్యువు అంచున చేరిన వారిని కాపాడుతున్నారు. నాలుగు వేల మంది చిన్నారులకు గుండె ఆపరేషన్లు చేసి వారిలో మళ్లీ చిరునవ్వులు పూయించారు. రోగులను ఇంతలా మానవీయ సేవలందిస్తున్న ఈ ఆస్పత్రి ప్రస్థానాన్ని చూసి అపోలో ఆస్పత్రుల ఛైర్మన్ ప్రతాప్ సి.రెడ్డి అచ్చెరువొందారు. రెండేళ్ల క్రితం ఆయన సెంటర్‌ను సందర్శించి వైద్యబృంద సేవలను కొనియాడారు. ఇంతకంటే గొప్పగా తమ ఆస్పత్రి ఉండదంటూ సంస్థ తరఫున పరికరాలు అందజేస్తూ కితాబునిచ్చారు.

పేదుకు ఉచిత వైద్య సేవలు

టీటీడీ శ్రీవేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టు సహకారంతో నడుస్తున్న హార్ట్ సెంటర్‌లో వైద్యసేవలు పేదలకు ఉచితం. ఎన్టీఆర్ వైద్యసేవతో పాటు ఆయుష్మాన్ భారత్ కార్డులున్న వారికీ ఇక్కడ ఉచితంగా వైద్యం చేస్తున్నారు. మన రాష్ట్రానికి చెందిన వారే కాకుండా యూపీ, బిహార్, జార్ఖండ్, వెస్ట్ బెంగాల్, ఒడిశానుంచీ వస్తుంటారు. పొరుగున ఉన్న బంగ్లాదేశ్ నుంచి కూడా హృద్రోగ బాధితులు వస్తున్నారంటే సెంటర్ విశిష్టత అర్థం చేసుకోవచ్చు. ఈ సేవలను గుర్తించిన ఆసియా టుడే రీసెర్చ్, మీడియా 2023లో బెస్ట్ పీడియాట్రిక్ కార్డియాక్ సెంటర్‌గా ఎంపిక చేసింది.



కొత్త భవనం నమూనా

విస్తరణ దిశగా అడుగులు

హార్ట్ సెంటర్ మరింత విస్తరించనుంది. బర్డ్ ఆస్పత్రి పాత భవనంలో 70 పడకలతో తాత్కాలికంగా ప్రారంభమైన ఈ సెంటర్ ఇప్పుడు రూ.250కోట్లతో పీడియాట్రిక్ సూపర్ స్పెషాలిటీగా రూపుదిద్దుకుంటోంది. ఇందులో 350 పడకలుంటాయి. 14 అదనపు పీడియాట్రిక్ సూపర్ స్పెషాలిటీస్ సేవలు అందుబాటులోకి వస్తాయి. న్యూరాలజీ, కిడ్నీ వ్యాధులు, కాలేయం, హెమటో అంకాలజీ, తలసీమియా రోగులకు సేవలందిచడంతోపాలు బోన్ మారో ట్రాన్స్‌ప్లాంట్ చికిత్స సైతం చేసేందుకు వడివడిగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. అంతర్జాతీయ ప్రమాణాలతో ఐకానిక్‌గా నిర్మిస్తున్న కొత్త భవనంలో మల్టీ ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్ ఎయిర్ అంబులెన్స్ యూనిట్ సైతం ఏర్పాటవుతోంది. మరో ఏడాదిలో హార్ట్ సెంటర్ మరింతగా ఎదిగేందుకు సమాయత్తమవుతోంది.

హార్ట్ సెంటరుకు శ్రీ'నాథుడు'



హార్ట్ సెంటర్ గుర్తింపు వెనుక డైరెక్టర్ శ్రీనాథ్ రెడ్డి విశేష ప్రతిభ,పెద్ద మనసు దాగి ఉంది. ఉత్తమ పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్‌గా తన బృందానికి సమర్థ సారథ్యం వహిస్తున్నారు. దాతల ద్వారా వచ్చే అధునాతనమైన పరికరాలను అందుబాటులోకి తీసుకొస్తున్నారు. పేరెన్నికగన్న కార్పొరేట్ ఆస్పత్రులు నెలకు రూ.10 లక్షలు జీతమిస్తామన్నా స్వామి సన్నిధిలో సేవ చేయడంలోనే ఆయన సంతృప్తి చెందుతారని శ్రీనాథ్ సన్నిహితులు చెబుతారు.తెలంగాణ గవర్నర్ తమిళిసై నుంచి డాక్టర్ శ్రీనాథ్ అవార్డు అందుకున్నారు.

నా బిడ్డకు పునర్జన్మ



హైదరాబాద్‌లో నా భార్య బాబుకు జన్మనిచ్చింది. వెనువెంటనే పసికందుకు గుండె సమస్య ఉందని తేలింది. హైదరాబాదులో రూ. 6లక్షలు అవుతుందన్నారు. ఏం చేయాలో పాలుపోలేదు. తిరుపతి హార్ట్ సెంటర్ గురించి తెలుసుకుని ఈనెల 9న జాయిన్ చేశాం. 48 గంటల్లోనే వైద్యులు శస్త్రచికిత్స చేశారు. బిడ్డకు పునర్జన్మ ఇచ్చారు. ఈ ఆస్పత్రికి జీవితాంతం రుణపడి ఉంటాం.

- మురళి, ఆటోడ్రైవర్, సి.మల్లవరం, చిత్తూరు జిల్లా



నాకు కొత్త బతుకు ఇచ్చారు

మాది తూర్పుగోదావరి జిల్లా జి.రాగంపేట. మా నాన్న రైతు. గతేడాది డిసెంబరులో నాకు ఛాతిలో ఇబ్బంది వచ్చింది. చాలా ఊళ్లు తిరిగాం. తగ్గలేదు. చివరికి గుండె మార్పిడి చేయాలన్నారు. విశాఖ వైద్యుల సూచనతో ఈ ఏడాది జనవరి 21న తిరుపతి హార్ట్ సెంటర్‌కు వచ్చాం. దాత గుండె కోసం ఇక్కడే అద్దెకు ఇల్లు తీసుకుని ఎదురుచూశాం. మార్చి 2న గుండె దొరికిందని ఫోన్ చేశారు. విజయవాడలో బ్రెయిన్ స్ట్రోక్‌తో చనిపోయిన వ్యక్తి నుంచి గుండెను ఆగమేఘాలపై తెచ్చి నాకు అమర్చారు. 40 రోజులు ఆస్పత్రిలోనే ఉన్నా. ఆస్పత్రి డైరెక్టర్ శ్రీనాథ్ సర్ కొత్త బతుకునిచ్చారు. నెలకోసారి రివ్యూకి వస్తున్నా. ఇప్పుడు ఆరోగ్యం బాగుంది.

- వై. వినయ్, బి.ఫార్మశీ విద్యార్థి

ఘాట్‌లో అదుపుతప్పి చెట్టును ఢీకొన్న కారు



ప్రమాదానికి గురైన కారు, గాయపడిన భక్తులు

తిరుమల,జూలై16(ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటి ఘాట్‌రోడ్డులో బుధవారం ఓ కారు అదుపుతప్పి చెట్టును ఢీకొంది. బెంగుళూరుకు చెందిన నలుగురు భక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. వినాయక స్వామి ఆలయానికి సమీపంలో ఈ ప్రమాదం జరిగింది.

21న టీటీడీ ఎస్వీ శిల్ప కళాశాల ప్రవేశ పరీక్ష

తిరుపతి అర్బన్, జూలై 16(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఆధ్వర్యంలోని ఎస్వీ శిల్పకళాశాలలో మొదటి సంవత్సరం ప్రవేశాలకు ఈ నెల 21న పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వెంకట్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 9 గంటలకు అలిపిరి సమీపంలోని కళాశాల ప్రాంగణంలో పరీక్ష జరుగుతుందన్నారు. దరఖాస్తు చేసుకోని వాళ్లూ నేరుగా పదో తరగతి ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావచ్చన్నారు. ఇందుకుగాను రూ.350 చెల్లించవలసి ఉంటుందని తెలిపారు. అర్హత సాధించినవారికి విద్యార్థులకు 28వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయన్నారు. ఎంపికైన వారికి ఉపాధి అవకాశాల నిమిత్తం మొదటి ఏడాదిలోనే టీటీడీ రూ.లక్ష బ్యాంకులో డిపాజిట్ చేస్తుందన్నారు. నాలుగేళ్లలో ఆలయ నిర్మాణం, శిల, సుధా, దారు, లోహ శిల్ప, సంప్రదాయ చిత్రలేఖనంలో శిక్షణ ఇస్తామన్నారు. మరిన్ని వివరాల కోసం 0877-2264637, 98669 97290, 94403 67826 నెంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

ఐఐటీలో నేడు ఫుడ్ ప్రాసెసింగ్ సెంటర్ ప్రారంభం



ఐఐటీలోని ఫుడ్‌ప్రాసెసింగ్ సెంటర్

ఏర్పేడు, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు సమీపంలోని ఐఐటీలో కామన్ ఇంక్యుబేషన్ సెంటర్(సీఐసీ)ని గురువారం కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్, రాష్ట్ర మంత్రి టీజీ భరత్ వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంకటేశ్వర్, ఐఐటీ డైరెక్టర్ కె.ఎన్.సత్యనారాయణ, ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ సీఈవో శేఖర్ బాబు పాల్గొననున్నారు. ఈ కేంద్రాన్ని ప్రధానమంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రోఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ కింద ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రిత్వశాఖ అభివృద్ధి చేసింది. ఈ కేంద్రాన్ని తిరుపతి ఐఐటీ రసాయనిక ఇంజినీరింగ్ ప్రొఫెసర్ కె.ఎస్.ఎం.రాఘవరావు సమన్వయంతో ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ మార్గదర్శకత్వంలో అభివృద్ధి చేశారు. ఈ కేంద్రంలో రోజుకు 20 టన్నుల మామిడి, అంజీర్, జామ తదితర పండ్లతో జ్యూస్, పల్ప్, జామ్, పికిల్స్ వంటివి తయారు చేస్తారు. ఈ యూనిట్ విద్యార్థులకు పరిశోధన కేంద్రంగా కూడా ఉపయోగపడుతుంది. స్థానికంగా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు కానుండటంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

బంగారు కుటుంబాలకు భరోసా ఇవ్వాలి

- ఎల్లుండి మార్గదర్శకులతో సీఎం ముఖాముఖి




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), జూలై 16(ఆంధ్రజ్యోతి): ఆదాయంలో అట్టడుగున ఉన్న 20 శాతం కుటుంబాలను గుర్తించి, బంగారు కుటుంబాలుగా ఎంపిక చేస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ చెప్పారు. వారికి భరోసా ఇవ్వాలని కోరారు. బుధవారం కలెక్టరేట్‌లో ఆయన అధికారులు, మార్గదర్శకులతో పీ4పై సమావేశం నిర్వహించారు. వీరిని ఆర్థికంగా ఉన్నత స్థాయిలో ఉన్న వారు దత్తత తీసుకునేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. విద్యతోపాటు నైపుణ్యం కల్పించి అండగా నిలవాలన్నదే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. శనివారం తిరుపతికి వస్తున్న సీఎం చంద్రబాబు.. బంగారు కుటుంబాలు, మార్గదర్శకులతో ముఖాముఖి ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, నగర పాలక సంస్థ కమిషనర్ మౌర్య, తాజ్ హోటల్, పాయ్ వైస్రాయ్ హోటల్ ప్రతినిధులు, రాస్, అమరరాజా, రోటరీ క్లబ్ మార్గదర్శకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చెస్ శిక్షణ

- చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దివాకర్‌రెడ్డి



చెస్ గ్రాండ్ మాస్టర్‌తో మాట్లాడుతున్న దివాకర్‌రెడ్డి, శర్మ

తిరుపతి(క్రీడలు), జూలై 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు చదరంగం శిక్షణ తరగతులు ఏర్పాటు చేయబోతున్నామని తుడా ఛైర్మన్, చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాలర్ దివాకర్‌రెడ్డి తెలిపారు. ఇండియన్ చెస్ గ్రాండ్ మాస్టర్, ధ్యానచంద్ అవార్డు గ్రహీత అభిజిత్‌కుంటే తిరుపతి పర్యటన నిమిత్తం బుధవారం ఉదయం రేణిగుంట విమానాశ్రయం చేరుకున్నారు. రాష్ట్ర, జిల్లా చెస్ అసోసియేషన్ ప్రతినిధులు కె.వి.వి.శర్మ, మల్లికార్జున, శ్రీనివాసమూరి, బాలాజీచౌదరి, వెంకట్ అనీల్, వాసువర్మ, సిసింద్రీ, సునీత ఆయనకు స్వాగతం పలికారు. అభిజిత్‌కుంటే తుడా కార్యాలయంలో దివాకర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పలు అంశాలపై చర్చించారు. ఆయన రాత్రికి తిరుపతిలోనే బసచేసి, గురువారం ఉదయం తిరుమల చేరుకుని శ్రీవారిని దర్శించుకోనున్నారు. అనంతరం మంగళంలోని ప్రభుత్వ బాలుర వసతిగృహాన్ని సందర్శిస్తారు. ఇటీవల జరిగిన ఆన్‌లైన్ అంతర్జాతీయ చదరంగం పోటీలలో విజేతలుగా నిలిచిన పిల్లలకు మెడల్స్ ప్రదానం చేస్తారు.

అవ్వాచారి కోనలోకి దూకేశాడు

- రోప్‌ల ద్వారా దిగి జీపు డ్రైవరును రక్షించిన భద్రతాసిబ్బంది

తిరుమల, జూలై16 (ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటి ఘాట్ రోడ్డులోని లోయలో దూకిన ఓ డ్రైవర్‌ను టీటీడీ భద్రతా సిబ్బంది కాపాడారు. నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ సమీపంలోని దొర్నిపాడుకు చెందిన జీపు డ్రైవర్ బోయా మాధవ రాయుడు(30) బుధవారం ఉదయం 10.30 గంటల సమయంలో అలిపిరి కాలినడకమార్గంలో తిరుమలకు వస్తూ అక్కగార్ల ఆలయానికి సమీపంలోని అవ్వాచారి కోనలోకి దూకేశాడు. గమనించిన భక్తులు వెంటనే సమీపంలోని భద్రతా సిబ్బందికి సమాచారమిచ్చారు. తిరుమల పోలీసులు, ఫైర్, విజిలెన్స్, ఫారెస్ట్ అధికారులు ఆ ప్రాంతానికి చేరుకుని రోప్‌ల ద్వారా లోయలోకి దిగి వెతికారు. గాయాలతో ఉన్న మాధవ రాయుడిని పైకి తీసుకొచ్చి తిరుమలలోని అశ్విని ఆస్పత్రికి తరలించారు. చిన్న చిన్న గాయాలతోపాటూ అతడి చేయి విరిగిందని, ఆరోగ్యం నిలకడగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు. తన భార్య అనారోగ్యం వల్ల లోయలోకి దూకేశానని మాధవ రాయుడు పోలీసులకు తెలిపారు.



మాధవ రాయుడిని లోయ నుంచి బయటకు తీసుకొస్తున్న భద్రతాసిబ్బంది - చికిత్స పొందుతున్న మాధవ రాయుడు

- రైలు పెట్టె కాలిన ఘటనలో

ఇద్దరు ఎస్ఎస్ఈల సస్పెన్షన్!

తిరుపతి(సెంట్రల్), జూన్16(ఆంధ్రజ్యోతి): తిరుపతి రైల్వే స్టేషన్ రైళ్ల పార్కింగ్ యార్డులో రెండు రోజుల క్రితం బోగీ కాలిపోయిన ఘటనలో ఇద్దరు ఎస్ఎస్ఈలను సస్పెండ్ చేసినట్లు ఉన్నత స్థాయి అధికార వర్గాలు తెలిపాయి. హిస్సార్- తిరుపతి వారాంతరపు ఎక్స్‌ప్రెస్ రైలు బోగీ కాలిన ఘటనపై విచారణ జరుగుతోంది. పీసీఎంఈ, సీనియర్ డీఎంఈ మణికుమార్, ఇతర అధికారులు కాలిన బోగీని పరిశీలించారు. సోమవారం విధి నిర్వహణలో ఉన్న పర్యవేక్షక సీనియర్ సెక్షన్ ఇంజనీర్లు మురళి, వరప్రసాద్‌ను సస్పెండ్ చేసినట్లు తెలిపారు. కాగా, ఈ మంటలను సకాలంలో గుర్తించడం ద్వారా.. కోట్ల రూపాయల రైల్వే ఆస్తిని కాపాడిన చిరుద్యోగి, పాయింట్స్ మెన్ హరీష్ కుమార్ ఇంటికి బుధవారం గుంతకల్లు డివిజన్ అదనపు డివిజన్ మేనేజరు సుధాకర్ వెళ్లారు. గాయపడిన ఆయన్ను పరామర్శించారు.

రైల్వే స్టేషన్‌లో ఏడీఆర్ఎం తనిఖీలు

తిరుపతి రైల్వే స్టేషన్లలో బుధవారం గుంతకల్లు డివిజన్ ఏడీఆర్ఎం మణికుమార్ తనిఖీలు నిర్వహించారు. ప్లాట్ ఫారాలను పరిశీలించారు. పరిశుభ్రత ప్రమాణాలను మెరుగు పరచాలని ఆదేశించారు. మొదటి ప్లాట్ ఫారంలోని కార్యాలయాలను పరిశీలించిన ఆయన.. కాలం చెల్లిన వస్తువులను స్టోర్స్‌కు తరలించాలని ఆదేశించారు. అధికారులు మణికంఠ, మణికుమార్ ఎస్ఎమ్ఆర్ డాక్టర్ కె.చిన్నపరెడ్డి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఏనుగుల దాడిలో ధ్వంసమైన వరి పంట

మళ్లీ ఏనుగుల భయం

- యల్లంపల్లెలో వరిపొలాలపై దాడి

చంద్రగిరి, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండలంలో ఏనుగులు మళ్లీ అలజడి రేపుతున్నాయి. యల్లంపల్లెలో మంగళవారం అర్ధరాత్రి పంట పొలాలపై దాడి చేశాయి. ఏడు ఏనుగులు చొరబడి ధనప్రకాష్‌రెడ్డి, మునికృష్ణయాదవ్‌లకు చెందిన పొలాల ఫెన్సింగ్ రాళ్లను తొలగించి పైపులు ధ్వంసం చేశాయి. వరి పంటను తొక్కేశాయి. గ్రామానికి ఆనుకొని పొలాలు ఉండటంతో ఏనుగులు వచ్చి దాడి చేస్తాయేమోనని గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు. వీరి సమాచారంతో అటవీ అధికారులు, సిబ్బంది వచ్చి ఏనుగులను అటవీ ప్రాంతంలోకి మళ్లించడానికి ప్రయత్నించారు. మూలపల్లి చెరువులో నీరుతాగి, ముంగిలిపట్టు అటవీ ప్రాంతంలోకి ఇవి వెళ్లిపోవడతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. ఏనుగులు పొలిమేరలోనే ఉండటంతో గ్రామస్థులు పంట పొలాలకు వెళ్లకూడదని, అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారులు హెచ్చరించారు. గతంలో మామిడిమానుగడ్డలో ఏనుగులు తిరగబడటంతో యల్లంపల్లి, భీమవరం, మూలపల్లె, కొండ్రెడ్డికండ్రిగ గ్రామస్థులు కలవరపడుతున్నారు. ఏనుగుల దాడిపై ఎమ్మెల్యే పులివర్తి నానీ అటవీశాఖ అధికారులను అప్రమత్తం చేశారు. కొద్దిరోజులపాటు ఆ ప్రాంతంలో తిరుగుతూ ఏనుగులు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. బాధిత రైతులకు త్వరగా నష్టపరిహారం చెల్లించేలా చూడాలని ఆదేశించారు.



పొలాలపై దాడులు చేస్తున్న ఏనుగులు




చేపల మార్కెట్ వద్ద రోడ్డుపై పారుతున్న నీరు - కరకంబాడీ రోడ్డులో.. - లక్ష్మీపురం కూడలి నుంచి బైరాగిపట్టెడ మలుపువరకు రోడ్డుపై పారుతున్న వర్షపు నీరు

తిరుపతిలో జోరువాన

నదులను తలపించిన రోడ్లు

వాహనదారులు, పాదచారులకు తప్పని ఇక్కట్లు

తిరుపతి అర్బన్, జూలై 16(ఆంధ్రజ్యోతి): చాలా రోజుల తర్వాత నగరంలో బుధవారం జోరువాన కురిసింది. పగలంతా ఎండ తీవ్రత కొనసాగింది. సాయంత్రం 4 గంటల తర్వాత ఆకాశంలో మబ్బులు కమ్ముకుని పెద్ద పెద్ద చినుకులతో వర్షం ప్రారంభమైంది. దాదాపు రెండు గంటల పాటు ఆగి ఆగి కురిసింది. రోడ్లన్నీ పూర్తిగా జలమయమై నీటి ప్రవాహం నదులను తలపించింది. మురుగు కాలువలు జోరుగా ప్రవహించాయి. అక్కడక్కడా అండర్ డ్రైనేజీ పొంగి పొర్లింది. బడి పిల్లలు, ఉద్యోగులు తడుస్తూనే ఇళ్లకు చేరుకున్నారు. కొందరు వాహనదారులు గరుడవారధి కింద తలదాచుకున్నారు. కొందరైతే హాయిగా ఉందంటూ తడుస్తూనే ప్రయాణం సాగించారు. చాలా రోజుల తర్వాత కపిలతీర్థం నుంచి జలపాతం జాలువారింది. గరుడ వారధిపై నుంచి వర్షపునీరు జోరుగా కిందికి దూకింది. సెంట్రల్ బస్టాండు, కూరగాయల మార్కెట్ జలమయమయ్యాయి. అండర్ బ్రిడ్జిలలో నీటి నిల్వతో కాసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వీధి వ్యాపారులకు ఇక్కట్లు తప్పలేదు. కాగా, కొన్ని నెలలుగా ఉష్ణతాపానికి అల్లాడిపోతున్న ప్రజలకు ఈ వర్షంతో ఉపశమనం లభించింది. సాయం సంధ్యవేళ ఆహ్లాదకర వాతావరణం నెలకొనడంతో నగర ప్రజలు హమ్మయ్య అని ఊపిరి పీల్చుకున్నారు. ఏడుకొండలపై మేఘమాల దృశ్యాలు ప్రకృతి ప్రేమికులకు కనువిందు చేసింది.

40 ద్విచక్రవాహనాలపై కేసు

రూ.50వేల జరిమానా వసూలు


విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీటీవో మురళీమోహన్, ఎంవీఐలు శ్రీనివాసరావు, అతికానాజ్

తిరుపతి(జీవకోన), జూలై 16(ఆంధ్రజ్యోతి): కరకంబాడీ రోడ్డులో జిల్లా రవాణా శాఖ అధికారులు బుధవారం వాహన తనిఖీలు చేపట్టారు. హెల్మెట్ ధరించకపోవడం, ట్రిపుల్ రైడింగ్, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం, లైసెన్స్ లేకపోవడం తదితర కారణాలతో 40 ద్విచక్ర వాహనదారులపై కేసులు నమోదు చేశారు. రూ.50వేలు జరిమానా వసూలు చేశారు. పట్టుబడిన వారిలో ఎక్కువ మంది ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులు ఉండడం గమనార్హం. జిల్లా రవాణాశాఖాధికారి కొర్రపాటి మురళీమోహన్ మాట్లాడుతూ భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా హెల్మెట్ ధరించాలని, రహదారి పరిస్థితులకు అనుగుణంగా వేగ నియంత్రణ చేసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ తనిఖీల్లో ఎంవీఐలు శ్రీనివారావు, అతికానాజ్ పాల్గొన్నారు.

‘రాచపూటి రమేష్ సాహిత్యం’ పుస్తకావిష్కరణ


పుస్తకావిష్కరణ చేస్తున్న వీసీ అప్పారావు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 16 (ఆంధ్రజ్యోతి): రాచపూటి రమేష్ సాహిత్యంపై సింగమాల చంద్రయ్య రూపొందించిన పుస్తకాన్ని ఎస్వీయూ వీసీ అప్పారావు ఆవిష్కరించారు. ఎస్వీయూ ఓఆర్ఐ విభాగంలో ప్రొఫెసర్ పీసీ వేంకటేశ్వర్లు పర్యవేక్షణలో పీహెచ్‌డీ క్రమంలో చంద్రయ్య ఈ పుస్తకాన్ని రాశారు. ఈ పుస్తకాన్ని తన ఛాంబర్‌లో వీసీ అప్పారావు ఆవిష్కరించిన అనంతరం మాట్లాడుతూ పోలీసు శాఖ నిఘా విభాగంలో ఉద్యోగం చేస్తూ పరిశోధన చేయడం విశేషమన్నారు. వృత్తి పనులు చేసే వారి జీవన స్థితిని వర్ణిస్తూ ఎంతో గొప్ప సాహిత్యం వచ్చిందన్నారు. చేనేత జౌళి శాఖలో ఉద్యోగిగా ఉన్న రాచపూటి రమేష్ తన అనుభవాలను రచనలుగా రూపొందించారని తెలిపారు. ఇలాంటి పుస్తకాలు మరిన్ని రాయాలని కోరారు. కాగా, తిరుపతి ప్రాంతీయ నిఘా విభాగ కార్యాలయంలో బుధవారం అడిషనల్ ఎస్పీ వెంకటరాముడు, డీఎస్పీ కంజక్షన్, ఇన్‌స్పెక్టర్ చంద్ర, సిబ్బంది వెంకటేశ్వరరావు, బాలాజీవర్మ ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఓఆర్ఐ డైరెక్టర్ ప్రొఫెసర్ పీసీ వేంకటేశ్వర్లు, పుస్తక రచయిత చంద్రయ్య, పలువురు అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా ఆణివార ఆస్థానం

తిరుపతి అర్బన్, జూలై 16(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని గోవిందరాజస్వామి, కోదండరామస్వామి, లక్ష్మీనరసింహస్వామి ఆలయాల్లో బుధవారం సాయంత్రం ఆణివార ఆస్థానం వైభవంగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వామి ఉత్సవర్లను ఆలయంలోని బంగారువాకిలి వద్దకు వేంచేపు చేసి ఆస్థానం కావించారు. ఈ సందర్భంగా పుండరీకవల్లి అమ్మవారి ఆలయం నుంచి నూతన వస్త్రాలను విమాన ప్రదక్షిణగా మూలవర్లకు సమర్పించారు. అలాగే సీతా లక్ష్మణ సమేత కోదండరామస్వామి ఉత్సవర్లను ఆలయంలోని గరుడాళ్వార్‌కు అభిముఖంగా వేంచేపు చేసి ప్రత్యేకంగా ఆస్థానం నిర్వహించారు. అనంతరం ఉత్సవర్లను మాడవీధుల్లో ఊరేగించారు. అలిపిరి పాదాల మండపంలోని లక్ష్మీనారాయణస్వామి ఆలయంలోనూ శాస్త్రోక్తంగా ఆస్థానం జరిపించారు. ఈ ఉత్సవాలలో టీటీడీ జియ్యంగారు, అధికారులు పాల్గొన్నారు.

సీపీఐ ఎప్పుడూ ప్రజల పక్షమే

తిరుపతి(ఆటోనగర్), జూలై16(ఆంధ్రజ్యోతి): ప్రజల పక్షాన నిలబడి వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేసిన ఏకైక పార్టీ సీపీఐ అని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పి.మురళి అన్నారు. తిరుపతిలో నిర్వహించనున్న పార్టీ మహాసభలను విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. తిరుపతి అభివృద్ధిలో సీపీఐ పాత్రను ఆయన బుధవారం ప్రచారం చేశారు. ఆటో కార్మికుల కోసం చేసిన పోరాటాలను వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాధాకృష్ణ, అల్లాబక్ష్, ఆటో కార్మిక సంఘం నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

పుంగనూరులో పట్టపగలే చైన్‌స్నాచింగ్

పుంగనూరు రూరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పుంగనూరులో నడిచి వెళుతున్న ఓ వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసును బుధవారం ఉదయం ఇద్దరు చైన్‌స్నాచర్లు ద్విచక్రవాహనంలో వచ్చి లాక్కెళ్లారు. బాధితురాలి కథనం మేరకు.. పుంగనూరు పట్టణంలోని కట్టకిందపాళ్యానికి చెందిన వెంకటేశులు భార్య భాగ్యలక్ష్మి(70) మనువళ్లకు టిఫిన్ తీసుకురావడానికి ఇంటి సమీపంలోని హోటల్ వద్దకు వెళుతుండగా ఇద్దరు గుర్తు తెలియని దుండగులు ద్విచక్రవాహనంలో వచ్చి మెడలోని బంగారు చైన్ (24 గ్రాములు) లాక్కెళ్లారు. దీంతో భాగ్యలక్ష్మి కిందపడి స్వల్పంగా గాయపడింది. అప్పటికే దుండగులు ద్విచక్రవాహనంలో పరారయ్యారు. పట్టపగలే జనసంచారం ఉన్న కట్టకిందపాళ్యంలోనే చైన్‌స్నాచింగ్ జరగడంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జర్నలిస్ట్ హెల్త్‌స్కీం గడువు పొడిగింపు

చిత్తూరు కలెక్టరేట్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్‌స్కీం 2025-26వ ఆర్థిక సంవత్సరానికి పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లావ్యాప్తంగా అక్రిడిటేషన్లు కలిగివున్న వర్కింగ్ జర్నలిస్టులందరూ ఈ పథకానికి ప్రీమియం కింద రూ.1250 డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.సీఎఫ్ఎంఎస్.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా హెడ్ అకౌంట్ 8342-00-120-01-03-001-001, డీడీవో కోడ్ 2703 0802 003 పద్దుకింద చెల్లించి లబ్ధిపొందాలన్నారు. ప్రీమియం చెల్లించిన జర్నలిస్టులు ఒరిజినల్ చలానా, రెన్యూవల్ చేసుకున్న అక్రిడిటేషన్ జిరాక్స్ కాపీలను కలెక్టరేట్‌లోని జిల్లా సమాచార పౌరసంబంధాల కార్యాలయంలో అందించాలన్నారు. హెల్త్‌స్కీమ్ ప్రీమియం రూ.2500 కాగా, ఇందులో జర్నలిస్టు వాటా రూ.1250, ప్రభుత్వ వాటా రూ.1250 అన్నారు. జర్నలిస్టు భార్య, భర్త, పిల్లలు, వారిపై ఆధారపడ్డ తల్లిదండ్రులకు ఈ స్కీమ్ వర్తిస్తుందన్నారు. జర్నలిస్టుల వైద్యఖర్చులను డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టు విధివిధానాలను అనుసరించి చెల్లిస్తుందన్నారు. జర్నలిస్టులకు లేదా వారిపై ఆధారపడ్డ కుటుంబసభ్యులకు ఏదైనా అనారోగ్యం సంభవిస్తే హెల్త్‌స్కీమ్ ద్వారా రూ.2 లక్షల వరకు విలువచేసే వైద్యసేవలు అందుతాయన్నారు. ఇలా సంవత్సర కాలంలో ఎన్నిసార్లయినా పరిమితి లేకుండా ఈ సదుపాయాన్ని పొందవచ్చని చెప్పారు. వర్కింగ్ జర్నలిస్టు హెల్త్ స్కీమ్ ద్వారా జర్నలిస్టులకు ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ (ఈహెచ్ఎస్) తరహాలో నగదు రహితంగా వైద్యసేవలను ప్రభుత్వం అందిస్తున్నదన్నారు. దీనిపై ఎలాంటి ఆదాయ పరిమితులు లేవని, నిర్దేశిత చికిత్సలకు సంబంధించి ఉచిత ఔట్‌పేషంట్ సేవలు కూడా పొందవచ్చని ఆయన సూచించారు. అక్రిడిటేషన్ కల్గిన జర్నలిస్టులందరూ ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.

18న నగరిలో జాబ్‌మేళా

చిత్తూరు అర్బన్, జూలై 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్, సీడీప్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 18న నగరిలోని శ్రీసూర్య డిగ్రీ, జూనియర్ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గుణశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ జాబ్‌మేళాలో 19 ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయని, టెన్త్, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, బీఫార్మసీ అర్హత కలిగిన అభ్యర్థులు అర్హులన్నారు. అభ్యర్థుల వయస్సు 18నుంచి 35 సంవత్సరాల్లోపు ఉండాలన్నారు. జాబ్‌మేళాలో ఎంపికైన వారికి రూ.12 నుంచి రూ.22వేల వరకు వేతనాలు అందే అవకాశాలు ఉన్నాయన్నారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 6300854441ను సంప్రదించాలని కోరారు.

డ్రగ్స్‌తో యువత భవిష్యత్తు నాశనం



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఈగల్ టీం సీఐ ప్రసాద్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 16 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ వినియోగంతో యువత భవిష్యత్తు పూర్తిగా నాశనం అవుతుందని ఈగల్ టీం సీఐ ప్రసాద్ పేర్కొన్నారు. ఎస్వీ యూనివర్సిటీ స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్ విభాగం ఆధ్వర్యంలో డ్రగ్స్ నివారణపై గేట్ డిగ్రీ కాలేజీలో బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. డ్రగ్స్ వాడకంతో యువత శారీరకంగా, మానసికంగా ఇబ్బంది పడుతోందన్నారు. చదువు, కెరీర్, కుటుంబం, సమాజం పట్ల బాధ్యత లేకుండా ప్రవర్తించే ప్రమాదం ఉంటుందన్నారు. డ్రగ్స్ నివారణకు యువత తోడ్పాటు అందించాలని కోరారు. ఎస్వీ యూనివర్సిటీ కల్చరల్ అఫైర్స్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్ చౌదరి మాట్లాడుతూ.. యువత భాగస్వామ్యంతో డ్రగ్స్‌ను పూర్తిగా నిర్మూలించడం సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గేట్ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ రమేష్, హెడ్ కానిస్టేబుళ్లు గిరిబాబు, కమల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో ఎమ్మెల్సీ ఆలపాటి

తిరుచానూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారిని బుధవారం ఎమ్మెల్సీ ఆలపాటి రాజా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.

డిగ్రీలో మూడు సబ్జెక్టుల విధానం తీసుకురావాలి

తిరుపతి(విద్య), జూలై 16(ఆంధ్రజ్యోతి): డిగ్రీ విద్యలో మళ్లీ మూడు సబ్జెక్టుల విధానం తీసుకురావాలని ఆలిండియా సేవ్ ఎడ్యుకేషన్ కమిటీ (ఏఐఎస్ఈసీ) రాష్ట్ర అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ఎం.సుబ్రహ్మణ్యం కోరారు. కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన 2020 విద్యా విధానం వినాశకరమైందిగా ఉందని పేర్కొన్నారు. ఈ విధానం వల్ల డిగ్రీ విద్యావ్యవస్థ కుప్పకూలే పరిస్థితులు ఏర్పడ్డాయని తెలిపారు. మూడు సబ్జెక్టులు ఎంపిక చేసుకునే విధానానికి వ్యతిరేకంగా సింగిల్ మేజర్ విధానాన్ని తీసుకురావడం వల్ల విద్యార్థులకు ఆయా అంశాలపై సమగ్రమైన జ్ఞానం అందడంలేదని వివరించారు. దీంతో అనేక కళాశాలల్లో ప్రవేశాలు తగ్గిపోయాయని పేర్కొన్నారు. దీనికితోడు అధ్యాపకులను ఇష్టారీతిన బదిలీ చేయడం వల్ల విద్యా ప్రమాణాలు మరింతగా పడిపోయే ప్రమాదముందని తెలిపారు. ఇంటర్ ఫలితాలు విడుదలై మూడు నెలలు గడుస్తున్నా ఇంతవరకు డిగ్రీ కళాశాలలకు ప్రవేశాలు జరగకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. డిగ్రీ ప్రవేశాలను ఆఫ్‌లైన్ పద్ధతిలో చేపట్టడానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

కడప పెద్దదర్గా గురువును అవమానించిన

షకీషఫీపై కేసు నమోదు

తిరుపతి(నేరవిభాగం), జూలై 16(ఆంధ్రజ్యోతి): కడప పెద్దదర్గా గురువు ఆరీఫుల్లాను దూషించి అవమానపరచిన అనంతపురం రాంనగర్‌కు చెందిన షకీషఫీపై బుధవారం తిరుపతి ఈస్ట్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ శ్రీనివాసులు వివరాల మేరకు.. కొన్ని రోజుల క్రితం ఆరీఫుల్లాను ఒక ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధిగా ఉన్న షకీషఫీ దుర్భాషలాడి అవమానపరిచాడు. దీనిపై ఆరీఫుల్లా శిష్యుడు తిరుపతికి చెందిన షేక్‌చాంద్‌బాషా కోర్టుకు వెళ్లాడు. కోర్టు ఆదేశాల మేరకు ఈస్ట్ పోలీసులు షకీషఫీపై కేసు నమోదు చేశారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

సూళ్లూరుపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలంటూ బుధవారం సూళ్లూరుపేటలో పారి శుధ్య, ఇంజనీరింగ్ కార్మికులు సమ్మె చేపట్టారు. మున్సిపాలిటీ కార్యా లయం ఎదుట ధర్నా నిర్వహించారు. దీర్ఘకాలంగా కార్మికుల ఎదు ర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించడంతో పాటు సంక్షేమ పథకాలను కార్మికులకు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. గత వైసీపీ ప్రభుత్వం తమకు అన్యాయం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం ఏడాదైనా పట్టించుకోలేదన్నారు. జీవో నెంబరు 36 ప్రకారం వేతనాలు చెల్లించి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్టాండు వద్దనున్న అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు లక్ష్మయ్య, ఎస్కే రియాజ్, అక్బర్, నాగరాజు, మరళి, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ పట్టణాధ్యక్షుడి జన్మదిన వేడుకలు

సూళ్లూరుపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఆకుతోట రమేష్ జన్మదిన వేడుకలను టీడీపీ నాయకులు, ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేశారు. ఆర్టీసీ బస్టాండు సెంటర్, కోళ్లమిట్ట, మన్నారుపోలూరు ప్రాం తాల్లో అన్నదానం చేశారు. స్థానిక భవిత కేంద్రంలో విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దంతాల రవి, కొండలరావు, ఈవీ సురేష్, కొమరంజేరి శ్రీధర్, ఆరణి చంద్రమోహన్, పెంచలయ్య, మేడా సాయినారాయణ, ఆలీభాయ్, మార్కేండేయులు, వంశీ, సత్యనారాయణ, సునీల్ పాల్గొన్నారు.

టీడీపీ నేతకు నెలవల పరామర్శ


జీవీఆర్ నాయుడిని పరామర్శిస్తున్న నెలవల తదితరులు

నాయుడుపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నేత, ప్రముఖ వ్యాపారవేత్త జీవీఆర్ నాయుడును సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం బుధవారం పరామర్శించారు. జీవీఆర్ నాయుడు ఇటీవల శస్త్రచికిత్స చేసు కున్నారు. ఆయనను నెలవలతో పాటు ఏఎంసీ మాజీ ఛైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, ఉగ్గుమూడి భాస్కర్‌రెడ్డి, చంద్రా రెడ్డి, కరీముల్లా, న్యాయవాది గంగాప్రసాద్, రాజశేఖర్, గాంధీనాయుడు, జువ్వలపాటి మస్తాన్, ముత్యాలయ్య, తదితరులు పరామర్శించారు.

కాండం కుళ్లు తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలి

కోట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సీజన్‌లో సాగులో ఉన్న వరిపంటలకు కాండం తొలుచు పురుగులు, కాండం కుళ్లు తెగుళ్ల వ్యాధులు వచ్చే అవకాశం ఉందని వీటిపై రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ అధికారి సుచేంద్ర ప్రసాద్ అన్నారు.

రాజీయే రాజమార్గం



ర్యాలీ నిర్వహిస్తున్న జడ్జి మీనాక్షి సుందరి, న్యాయవాదులు

నాయుడుపేట టౌన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కేసుల పరిష్కారంలో రాజీయే రాజమార్గమని నాయుడుపేట జూనియర్ సివిల్ జడ్జి మీనాక్షి సుందరి అన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి బజారు మీదుగా బుధవారం నాయుడుపేట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మీడియేషన్ ఫర్ ది నేషన్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జడ్జి మాట్లా డుతూ లోక్ అదాలత్ ద్వారా కేసులను రాజీ మార్గంలో సత్వరమే పరిష్కరించుకోవచ్చన్నారు. లోక్ అదాలత్‌లో కేసులను పరిష్కరించుకుంటే నగదు, సమయం ఆదా అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆశా చెంచుకృష్ణయ్య, న్యాయవాదులు వెందోటి పార్థసారథిరెడ్డి, కిషోర్, దారా రవి, చదలవాడ కుమార్, రమణయ్య, నారాయణ, రఫీ, శ్రీనివాసులు, కిరణ్, దశయ్య, చెంగయ్య, హరనాథ్‌రెడ్డి, సోమశేఖర్, అర్బన్ సీఐ బాబి, కోర్టు సిబ్బంది బుచ్చిబాబు, అంజలి తదితరులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వ వ్యవస్థను వినియోగించుకోండి

పెళ్లకూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): చిన్నచిన్న సివిల్ వ్యవహారాలను శిక్షణ పొందిన మధ్యవర్తుల ద్వారా స్థానికంగానే పరిష్కరించుకోవాలని నాయుడుపేట సివిల్ కోర్టు జడ్జి పి.మీనాక్షి సుందరి అన్నారు. బుధవారం పెళ్లకూరు మండలం పాలచ్చూరులో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. తొలుత గ్రామ సచివాలయ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో న్యాయమూర్తి మాట్లాడుతూ చిన్నచిన్న విషయాలపై కోర్టులను ఆశ్రయించడం సరికాదన్నారు. ఏదైనా సమస్యలు ఉంటే శిక్షణ పొందిన మధ్యవర్తి వ్యవస్థ ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. వృద్ధాప్యంలో తల్లిదండ్రులను ఇబ్బంది పెట్టే వారిపై చర్యలకు ప్రత్యేక చట్టం ఉందన్నారు. కార్యక్రమంలో నాయుడుపేట బార్ అధ్యక్షుడు చెంచుకృష్ణ, సీనియర్ న్యాయవాది పార్థసారథిరెడ్డి, ఏజీపీ హరినాథరెడ్డి, పరుశురాం, నిరంజన్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

వాకాడు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): వాకాడు బీసీ కాలనీలో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థను బుధవారం డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి వాణిరెడ్డి పరిశీలించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఎంపీడీవో శ్రీనివాసులు, ఈవోపీఆర్‌డీ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వ సేవలపై అవగాహనకే 1కే రన్



ర్యాలీలో న్యాయమూర్తి సంయుక్త, పోలీసులు, న్యాయవాదులు

సూళ్లూరుపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం పెండింగ్ కేసుల పరిష్కారం కోసం 1కే రన్ నిర్వహించారు. మధ్యవర్తిత్వ సేవలపై అవగాహన కల్పించడానికి స్థానిక మార్కెట్ సెంటర్ నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు నిర్వహించిన అవగాహన ర్యాలీలో ప్రిన్స్‌పల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి పి.సంయుక్త పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ మధ్యవర్తిత్వం అనేది ఒక నిర్మాణాత్మక ప్రక్రియని, దీని ద్వారా 90రోజుల్లో కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ మురళీకృష్ణ, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రకృతి కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తిరుమూరు సుధాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ధర్మాప్రసాదరావు, ఎస్ఐ బ్రహ్మనాయుడు, న్యాయవాదులు లక్ష్మయ్య, గణపతి, విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఏడాదిలో 14 వేల ఇళ్ల నిర్మాణం


అధికారులతో మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ దయాకర్

సూళ్లూరుపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది చివరిలోగా జిల్లాలో 14 వేల ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు గృహనిర్మాణశాఖ పీడీ ఈ.దయాకర్ తెలిపారు. బుధవారం ఆయన తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం మండలాల గృహనిర్మాణశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే 7300 గృహాలు పూర్తయ్యాయని, మిగిలిన టార్గెట్‌ను కూడా పూర్తిచేసేలా దృష్టిసారించామన్నారు. ఇళ్లు మంజూరైన లబ్ధిదారులందరూ త్వరగా నిర్మాణాలు పూర్తి చేసేలా సిబ్బంది ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. అలాగే నిర్మాణం పూర్తయిన ఇళ్లకు బిల్లులు పెండింగ్ లేకుండా చూడాలన్నారు. గత ప్రభుత్వం ఒక్కో ఇంటికి రూ.1.80 లక్షలు ఇవ్వగా, ప్రస్తుతం గిరిజనలకు రూ.75 వేలు, ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు ఇంటికి అదనంగా ఇచ్చేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. అర్హులైన వారికి కొత్త ఇళ్లను కూడా త్వరలోనే మంజూరు చేస్తామని పీడీ చెప్పారు. అనంతరం మన్నారుపోలూరులో ఇళ్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఈఈ ఏ.శ్రీనివాస రావు, ఏఈ సత్యనారాయణ, గృహ నిర్మాణశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కాకినాడ జిల్లా పెన్షనర్స్ కార్యాలయంలో

పుత్తూరు యూనిట్ అధ్యక్షుడు కృపావరం

కాకినాడ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్‌జీఆర్‌ఈ అసోసియేషన్ పుత్తూరు యూనిట్ అధ్యక్షుడు, రాష్ట్ర కార్యదర్శి పి.కృపావరం, సంఘ సభ్యురాలు రాగిణి బుధవారం కాకినాడ జిల్లా కార్యాలయాన్ని సందర్శించారు. సంఘం పనితీరు, నిర్వహణ పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ కార్యాలయం కార్పొరేట్ స్థాయిలో ఉందన్నారు. సర్వీస్, ఫ్యామిలీ పెన్షనర్లకు విలువైన సేవలు అందిస్తున్నారని కొనియాడారు. అనంతరం కృపావరం, రాగిణిలను కాకినాడ జిల్లా సంఘ సభ్యులు సత్కరించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శాస్త్రి మాట్లాడుతూ కృపావరం పుత్తూరు యూనిట్‌కు, రాష్ట్ర సంఘానికి అంకితభావంతో సేవలు అందిస్తున్నారన్నారు.పుత్తూరు యూనిట్ ఒక ఆదర్శ యూనిట్‌గా కొనసాగుతోందన్నారు.కాకినాడ జిల్లా అధ్యక్షుడు పద్మనాభం మాట్లాడుతూ కాకినాడ జిల్లా సంఘాన్ని స్థాపించి 50 సంవత్సరాలు పైబడిందని, అక్టోబరులో స్వర్ణోత్సవాలు నిర్వహిస్తామని చెప్పారు. రాష్ట్ర కార్యదర్శి కృపావరం మాట్లాడుతూ ఈ వేడుకల్లో తాను భాగస్వామిని అవుతానని చెప్పి తన వంతు విరాళంగా రూ.10,116 అందజేశారు. ప్రధాన కార్యదర్శి నూకరాజు, కోశాధికారి శేషగిరి, రాష్ట్ర కార్యదర్శి ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర వైపు పరుగులు

కోట, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : కూటమి ఏడాది పాలనలో రాష్ట్రం స్వర్ణాంధ్ర వైపు పరుగులు తీస్తోందని టీడీపీ మైనార్టీసెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ జలీల్ అహ్మద్ అన్నారు. కోట పట్టణ పరిధిలోని శ్రీలక్ష్మమ్మ గిరిజనకాలనీ, కోట క్రాస్‌రోడ్డులలో బుధవారం సుపరిపాలనలో తొలి అడుగుపై ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఏడాదిలో అభివృద్ధి సంక్షేమ పథకాలకు సంబంధించిన కరపత్రాలను ఇంటింటా తిరిగి పంపిణీ చేశారు.

మధ్యవర్తిత్వంతో త్వరితగతిన కేసుల పరిష్కారం



ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు

గూడూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వం వల్ల కేసులను త్వరితగతిన పరిష్కరించుకోవచ్చునని ఏడవ అదనపు జిల్లా జడ్జి వెంకటనాగపవన్ అన్నారు. బుధవారం మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మధ్యవర్తిత్వం - దేశం కోసం కార్యక్రమంపై స్థానిక కోర్టు సెంటర్ నుంచి పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యవర్తిత్వం ద్వారా శాంతియుత మార్గంలో త్వరితగతిన కేసులను పరిష్కరించుకునేందుకు వీలుంటుందన్నారు. దీనివల్ల సమయం, నగదు ఆదా చేసుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు బీవీ.సులోచనారాణి, గాయత్రిదేవి, న్యాయవాదులు అరవ పార్వతయ్య, కోటేశ్వరరావు, ఏడుకొండలు, భాస్కర్‌రావు, మెహబూబ్‌బాషా, కోర్టు సిబ్బంది, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

రాజీ కోసం మధ్యవర్తిత్వం చేసుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న వెంకటగిరి జడ్జి విష్ణువర్మ, న్యాయవాదులు

వెంకటగిరి టౌన్, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఫిర్యాదుదారులు మధ్యవర్తిత్వం ద్వారా కేసులను పరిష్కరించుకోవాలని జడ్జి విష్ణువర్మ అన్నారు. బుధవారం మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో వెంకటగిరి పట్టణంలోని ‘మధ్యవర్తిత్వం - దేశం కోసం’ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ చిన్నచిన్న తగాదాలకు కేసులు పెట్టుకుని సంవత్సరాల పాటు కోర్టులకు తిరిగి సమయం వృథా చేసుకోవద్దన్నారు. రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ రమణ, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

సీజేఎఫ్ఎస్ భూములను పరిరక్షించండి: సుధీర్

ఏర్పేడు, జూలై 16(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో సీజేఎఫ్ఎస్ భూములను గోల్‌మాల్ చేయాలని చూశారని అధికారులు వాటిని పరిరక్షించాలని ఎమ్మెల్యే సుధీర్ కోరారు. మండలంలోని ముసలిపేడు పంచాయతీ బత్తినయ్య గిరిజనకాలనీలో బుధవారం సాయంత్రం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలపై ఆరా తీశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో గిరిజనకాలనీ మహిళలు తమ కాలనీకి పొన్నేరు పల్లి మీదుగా వెళ్లే మార్గాన్ని తారురోడ్డుగా మార్చాలని కోరారు. అదే విధంగా 1974లో తమకు ప్రభుత్వం ఇచ్చిన సీజేఎఫ్ఎస్ భూములను ఆన్‌లైన్‌లో తమ పేర్లతో మార్చాలని గిరిజన రైతులు కోరారు. దీనిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ భార్గవిని ఎమ్మెల్యే కోరారు. టీడీపీ నాయకులు అంకయ్య, మనోహర్‌నాయుడు, నాగరాణి, ప్రసాద్‌నాయుడు, ధనంజయులు నాయుడు, పొన్నారావు, నాగరాజునాయుడు, మోహన్‌రావు, గురవారెడ్డి, చెంచయ్యనాయుడు, ఎంపీడీవో సౌభాగ్యం తదితరులు పాల్గొన్నారు.


బత్తినయ్యకాలనీవాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్

సుపరిపాలనతో రాష్ట్రాభివృద్ధి: ఆదిమూలం

కేవీబీపురం, జూలై 16(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు సుపరిపాలనలో రాష్ట్రం అభివృద్ధి చెందుతోందని ఎమ్మెల్యే ఆదిమూలం అన్నారు. మండలంలోని పెరిందేశంలో బుధవారం ఆయన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసి మధ్యాహ్న భోజనాన్ని పిల్లలతో కలిసి తిన్నారు. అనంతరం అంగన్‌వాడీలో సీమంతంలో పాల్గొని పౌష్టికాహారాన్ని అందజేశారు. మాజీ ఎంపీపీ మణి, రాయపేడు సర్పంచ్ బాలాజీ, అయ్యప్ప, మునిశేఖర్, తహసీల్దారు రోశయ్య, ఎంపీడీవో మాలతి, ఈవోపీఆర్డీ, సచివాలయ సిబ్బంది, ఎంఈవోలు లక్ష్మీపతి, రవికుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, ఉపాధి ఏఈ, తదితరులు పాల్గొన్నారు.


పెరిందేశంలో విద్యార్థులతో మధ్యాహ్న భోజనం చేస్తున్న ఎమ్మెల్యే

వైద్యశిబిరానికి స్పందన

సత్యవేడు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏఎంపురంలో దాసుకుప్పం పీహెచ్‌సీ వైద్యాధికారి హర్షవర్ధన్ ఆధ్వర్యంలో బుధవారం వైద్యశిబిరం జరిగింది. డెంగ్యూ మాసోత్సవాల్లో భాగంగా నిర్వహించిన శిబిరంలో జ్వర లక్షణాలున్న పలువురికి మలేరియా, డెంగ్యూ, హెపటైటిస్-బి ర్యాపిడ్ టెస్టులను నిర్వహించారు. నలుగురిని తుది పరీక్షల కోసం సత్యవేడు సీహెచ్‌సీకి రెఫర్ చేశారు. వైద్య బృందం గ్రామంలో దోమల నివారణ, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. దోమల నివారణకు మురుగు నీటి కాలువల్లో మలాథియాన్‌ను పిచికారీ చేశారు. సర్పంచ్ శిరీషారెడ్డి, మోహన్ సుబ్రమణ్యం, సౌమ్య, రేణుక, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

క్రీడల్లో యువత రాణించాలి

శ్రీకాళహస్తి, జూలై 16(ఆంధ్రజ్యోతి): యువత క్రీడల్లో రాణించాలని టీడీపీ నాయకుడు సత్రవాడ ప్రవీణ్ అన్నారు. బుధవారం పట్టణంలోని పానగల్ అయ్యంగార్ వీధి యువతకు ఆయన వాలీబాల్ కిట్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన యువత క్రీడల్లో రాణించడం వలన కలిగే ఉపయోగాలను వివరించారు.


విజ్ఞానగిరి ఆడికృత్తిక ఉత్సవాలకు ధ్వజారోహణం

శ్రీకాళహస్తి, జూలై 16(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలోని చెంగల్వరాయ సన్నిధి వద్ద బుధవారం శాస్త్రోక్తంగా ధ్వజారోహణ పూజలు నిర్వహించారు. విజ్ఞానగిరిపై ఆడికృత్తిక ఉత్సవాలను పురస్కరించుకుని ఈ పూజలు చేశారు. మొదట కలశస్థాపన, అభిషేక, హోమాలను నిర్వహించారు. అనంతరం అరటి ఆకులో ధ్వజస్తంభాన్ని తీర్చిదిద్ది ధ్వజారోహణాన్ని వేదోక్తంగా నిర్వహించారు. అనంతరం వళ్లీ, దేవసేన సమేత కుమారస్వామిని పట్టణంలో ఊరేగించారు.ఈ కార్యక్రమంలో ఈవో బాపిరెడ్డి, వేదపండితులు, అర్చకులు ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అంబారీపై స్వామి పురవిహారం

ఆడికృత్తిక ఉత్సవాల్లో భాగంగా శ్రీకాళహస్తీశ్వరాలయంలోని చెంగల్వరాయస్వామి వద్ద బుధవారం రాత్రి మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ చెంగల్వరాయస్వామిని అంబారీ వాహనంపై అధిష్టించి పట్టణంలో ఊరేగించారు. భక్తులు స్వామివారికి కర్పూర హారతులు సమర్పించారు.


ధ్వజారోహణ పూజలు


అంబారీపై దేవేరుల సహా కుమారస్వామి

23న జాబ్‌మేళా

కేవీబీపురం/పిచ్చాటూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ఆదిమూలం కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 23 తేదీ బుధవారం ఉదయం 8 గంటల నుంచి పిచ్చాటూరు ఎంకేటీ మహల్‌లో జాబ్‌మేళా జరగనుందని ఆయన తెలిపారు. ఈ క్రమంలో బుధవారం పెరిందేశంలో జాబ్‌మేళా పోస్టర్లను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈఎంసీ క్లస్టర్, శ్రీసిటీ, తిరుపతి, చెన్నైకి చెందిన 15 బహుళ జాతీయ కంపెనీల్లో 500పైగా ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, పీజీలో ఉత్తీర్ణులు అర్హులన్నారు. ఎన్ఏపీయా ఎన్‌వైఎం. ఏపీ.జీవోవీ.ఇన్/యూఎస్ఈఆర్‌లో ఆధార్ ఓటీపీతో రిజిస్ట్రేషన్ చేసుకుని, ప్రొఫైల్‌తో లాగిన్ అయి అన్ని కంపెనీలకు దరఖాస్తు చేసుకుని అడ్మిట్ కార్డుతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు. వివరాలకు నెం. 9440374535, 9908243736, 9988853335 లలో సంప్రదించాలన్నారు.

అమరాలో పోలీసులకు వార్షిక వైద్య పరీక్షలు

రేణిగుంట, జూలై 16(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా వ్యాప్తంగా 2518 మంది పోలీసులకు వైద్య పరీక్షలు నిర్వహించామని ఎస్పీ హర్షవర్ధన్ రాజు తెలిపారు. బుధవారం అమరరాజా గ్రూప్స్, అమరా హాస్పిటల్, కాంటినెంటల్ కాఫీ ఆధ్వర్యంలో కరకంబాడి అమరరాజా పరిశ్రమలోని ఆడిటోరియంలో వైద్య శిబిరం జరిగింది. శిబిరంలో ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి సరైన వైద్యం చేయించుకునేందుకు అవకాశం కల్గిందని ఎస్పీ అన్నారు. ఇందుకు సహకరించిన అమరా హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రమాదేవికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు ఎస్పీ పేర్కొన్నారు.

శాస్త్రోక్తంగా ఆణివార ఆస్థానం

నారాయణవనం, జూలై 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలో టీటీడీ అనుబంధ ఆలయం పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరుడి సన్నిధిలో బుధవారం సాయంత్రం ఆణివార ఆస్థానం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరచిన అర్చకులు శుద్ధి, తోమాల, అర్చన, గంట, నైవేద్యం సమర్పించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామికి స్నపన తిరుమంజనం చేపట్టారు. సాయంత్రం నిత్యకైంకర్యాల అనంతరం ఊంజల మండలంలో శేష వాహనంపై ఉభయ దేవరుల సమేత కల్యాణ వెంకన్నను కొలువు దీర్చారు. ఈ సందర్భంగా టీటీడీ తరుపున ఆలయాధికారులు పట్టువస్త్రాలను సమర్పించారు. ఆలయ అర్చకులు దేవేరుల సమేత కల్యాణ వెంకన్నకు ఆస్థానం నిర్వహించి భక్తులు అక్షతలను, తీర్థప్రసాదాలను అందించారు. ఆలయాధికారి నాగరాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

'దేశం కోసం మధ్యవర్తిత్వంపై' అవగాహన

సత్యవేడు, జూలై 16 ఆంధ్రజ్యోతి) భారత సుప్రీంకోర్టు ప్రవేశ పెట్టిన మీడియేషన్ ఫర్ నేషన్ (దేశం కోసం మధ్యవర్తిత్వం) కార్యక్రమంపై సత్యవేడు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి వెంకట నాగరాజు ఆధ్వర్యంలో బుధవారం కోర్టు ప్రాంగణంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ... వివాహ వివాదాలు, యాక్సిడెంట్ క్లెయిములు, గృహహింస, చెక్‌బౌన్స్ క్రిమినల్ కాంపౌండబుల్ తదితర కేసులను కక్షిదారులు చట్టపరంగా మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. న్యాయవాదులు, పోలీసులు ఈ అంశంపై కక్షిదారులకు అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సీఐ మురళి, బార్ అసోసియేషన్ నాయకులు, న్యాయవాదులు, సత్యవేడు, నాగలాపురం, వరదయ్యపాళెం, పిచ్చాటూరు పోలీసు అధికారులు పాల్గొన్నారు.


అవగాహన సదస్సులో ప్రసంగిస్తున్న జడ్జి వెంకట నాగరాజు

సమన్వయంతో పని చేయండి

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): వీఆర్వోలు, సచివాలయ సర్వేయర్లు సమన్వయంతో పని చేస్తేనే గ్రామాల్లో సమస్యలు పరిష్కారం అవుతాయని తహసీల్దార్ శ్రీదేవి చెప్పారు. తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌లో ఇంటి స్థలాలు, భూ సమస్యలపై అధిక సంఖ్యలో వినతులు వస్తున్నాయన్నారు. వాటిని వీఆర్వోలు, సచివాలయ సర్వేయర్లు ఉమ్మడిగా పరిశీలిస్తే చాలా వరకు పరిష్కారమవుతాయని తెలిపారు. వీఆర్వోలు, సచివాలయ సర్వేయర్లు గ్రామాల్లో పర్యటించాలని ఆదేశించారు.

పుత్తూరు వార్తలు

మధ్యవర్తిత్వాన్ని స్వాగతించండి


అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న జడ్జి సీఎస్ రాఘవేంద్ర

పుత్తూరు అర్బన్, జూలై 16(ఆంధ్రజ్యోతి): కోర్టుల్లో దీర్ఘకాలికంగా ఉన్న కేసుల భారాన్ని తగ్గించుకోవడానికి మధ్యవర్తిత్వ ప్రక్రియను కక్షిదారులు స్వాగతించాలని పుత్తూరు సీనియర్ సివిల్ జడ్జి సీఎస్ రాఘవేంద్ర చెప్పారు. బుధవారం జడ్జి ఆధ్వర్యంలో మధ్యవర్తిత్వంపై అవగాహన ర్యాలీ జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ జడ్జి జానకి, అదనపు జూనియర్ జడ్జి కె.రమ్యసాయి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గాలి సురేష్‌బాబు, కార్యదర్శి రాజేష్, ఇంద్రజిత్తు తదితరులు పాల్గొన్నారు

ప్లాస్టిక్ పునర్వినియోగ ప్రదర్శన



పుత్తూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించండి లేదా పునర్వినియోగించండని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ కోటీశ్వరయ్య చెప్పారు. కళాశాలలోని వృక్షశాస్త్ర విభాగం, ఇకో క్లబ్‌ల ఆధ్వర్యంలో బుధవారం ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన కార్యక్రమం, ప్రదర్శన ఏర్పాటు చేశారు.ప్లాస్టిక్ వ్యర్థాలు భూమిలో కలిసేందుకు చాలా కాలం పడుతుందన్నారు. ప్లాస్టిక్ అధిక వినియోగం వల్ల క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందన్నారు. ఇక ప్లాస్టిక్ వస్తువుల పునర్వినియోగంపై డిగ్రీ కళాశాల, బాలుర జూనియర్ కళాశాల విద్యార్థులు రూపొందించిన వస్తువుల ప్రదర్శన ఆకట్టుకుంది. అధ్యాపకులు పద్మావతి, సుజన, మన్యం నరసింహులు, వాణిశ్రీ పాల్గొన్నారు.

వివాదాస్పద భూములపై ఎటూ తేల్చని సర్వే అధికారులు

వడమాలపేట, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుమణ్యం రెవెన్యూ పరిధిలో వివాదాస్పద భూమిపై జిల్లా స్థాయి అధికారులు సర్వే చేపట్టారు. ఇటీవల ఎనమలపాళ్యం ఆది ఆంధ్రవాడవాసులు అప్పలాయగుంట రోడ్డులో ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుంటున్నారని కలెక్టర్‌కు ఫిర్యాదు అందింది. సర్వే నెం.195లో పూర్తిస్థాయిలో సర్వే చేయాలని, డ్రోన్ కెమెరాలతో వద్దని కోరారు. పెద్ద చెరువు వరవ కాలువ, పోరంబోకు, పిచ్చికులబండ పోరంబోకు కబ్జాలకు గురి అవుతున్నా సర్వే చేయడం లేదని దళితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆక్రమణలపై జిల్లా సర్వే అధికారులు ఏటూ తేల్చకపోవడంపై దళితులు నిలదీసారు. సర్వే అధికారులు చిట్టిబాబు, కృపాకర్, తహసీల్దార్ జరీనా, ఎస్ఐ ధర్మారెడ్డి పాల్గొన్నారు.